
ఘంటా హనుమయ్య ఛారిటీస్ ధర్మ సత్రం ఉన్న భవనంపై కళ్యాణ మండపాన్ని ఏర్పాటుచేసిన చిత్రం

ధర్మసత్రం.. లేదే లెక్కాపత్రం!

ఒకప్పుడు పేదల ఆకలి తీర్చిన అన్నదాన సత్రాలవి. బాటసారులకు నీడనిచ్చిన వసతి గృహాలు కూడా. దశాబ్దాల కాలంగా ఆకలితో వచ్చిన వారికి పట్టెడన్నం పెట్టడమే ఇక్కడ పరబ్రహ్మ స్వరూపంగా భావించే వారు. ఇదంతా ఒకప్పటి మాట... ఇప్పుడక్కడ అన్నం పెట్టేవారు లేరు. దాతృత్వం చూపేవారూ లేరు. దాన గుణం ఉండాల్సిన ఆ పవిత్ర స్థలాల్లో ఇప్పుడు స్వార్థం రాజ్యమేలుతోంది. దాతల ఆనాటి లక్ష్యం తారుమారై ఈనాడు వ్యాపారమైపోయింది. ఎందరికో నీడనిచ్చి, పట్టెడన్నం పెట్టాల్సిన చోట కాసులు పోగేసుకుని మింగేస్తున్నారు. వీటిని కాపాడాల్సిన దేవదాయ శాఖ అధికారులూ కొంతమంది వారితో చేతులు కలిపి వాటాలేసుకుని మరీ దోచేస్తున్నారు.


సత్రం బయట ఖాళీ స్థలాన్ని బీరువాలు తయారీ వారికి అద్దెకిచ్చిన చిత్రం

దాతలిచ్చిన సత్రాల ఆస్తుల విలువ నేడు రూ. వందల కోట్లు

- పేరుకే దేవదాయ శాఖ ఆధీనంలో...
- అంతా ట్రస్టీల సొంత ఆస్తులన్నట్టు వాటిలో వ్యాపారం
- పేదలకు అన్న'దానం' లేదు... ఆస్తులకు లెక్కాలేదు!
- పరిరక్షించాల్సిన అధికారులకూ వాటాల ఆశలు!
- సదావర్తి భూముల వ్యవహారం ఒక అనుభవం అయినా... కళ్లు తెరవని దేవదాయ శాఖ


బుర్రిపాలెం రోడ్డులోని బర్రిపూడి రామయ్య అన్నపూర్ణమ్మ ధర్మ సత్రం భవనం దుస్థితి

తెనాలి, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల క్రితం స్థలాలు, భవనాలు దానమిచ్చిన దాతల ఆశయానికి నిలువునా తూట్లు పొడుస్తున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం ఇచ్చిన స్థలాలు ఇప్పుడు మంచి వ్యాపార కూడళ్లవడం, ఉచితంగా ఇచ్చిన స్థలాల విలువ అమాంతం పెరిగిపోయి రూ. వందల కోట్లు పలుకుతుండటంతో కొంతమంది వాటిని సొంత ఆస్తుల తరహాలో అమ్మేసుకుంటున్న దారుణ పరిస్థితులు ఉన్నాయంటే అతిశయోక్తికాదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో ఇటువంటి అన్నదాన సత్రాలున్నాయి. వీటిలో చాలావరకు పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, వ్యాపార అనుకూల ప్రాంతాల్లో ఉండటం, అత్యంత ఖరీదైన స్థలాలున్న ప్రదేశాల జాబితాలోకి చేరటంతో నిన్నటి వరకు సత్రాల కార్యకలాపాలు సాగించిన ట్రస్టీలకు ఆశపెరిగిపోయి, సేవ చెయ్యాల్సినచోట వ్యాపారం చేసేస్తున్నారు. ఉన్న దుకాణాలను భారీ మొత్తంలో అద్దెలకిచ్చి, లెక్కల్లో మాత్రం తక్కువ చూపటం, సత్రాల ఖాళీ స్థలాలను సొంతగా అద్దెలకివ్వటం, వచ్చిన డబ్బును దేవదాయ శాఖ ఖాతాలో కాకుండా సొంత ఆస్తిలాగా జేబులో వేసుకోటం పరిపాటిగా మారింది. మరి కొన్నిచోట్లయితే సొంత (మిగతా 8వ పేజీలో)

> తెనాలిలో యడ్లపల్లి కోటిలింగం ధర్మ సత్రం బోస్‌రోడ్డులో ఉంది. దీని కింద 2 ఎకరాల భూమి, షాపులు ఆస్తిగా ఉన్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో ప్రతి సంక్రాంతికి 100 మంది జంగమ మహేశ్వరులకు బియ్యం దానం చేయాలి. ఇక్కడ అపర కర్మలకు అవకాశం ఇవ్వాలి. అయితే ఇది కొంత వరకు జనానికి ఉపయోగపడుతోంది. పట్టణంలో అద్దె ఇళ్లలో ఉండేవారికి అపరకర్మలకు ఇదే ఆధారం. అయితే ఆదాయ వ్యయాల లెక్కలు మాత్రం గుట్టుగా ఉంచుతారనే విమర్శ ఉంది.

పకడ్బందీగా.. పది పరీక్షలు

- జిల్లాలో 128 కేంద్రాలు
- జిల్లా రెవెన్యూ అధికారి మురళీ

నరసరావు పేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే నెల 17న జరగనున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు రెవెన్యూ అధికారి మురళీ తెలిపారు. పరీక్షల నిర్వహణకు 128 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టరేట్‌లో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ


సమావేశంలో పాల్గొన్న డీఆర్‌వో మురళీ, డీఈవో చంద్రకళ

రెగ్యులర్.. ఓపెన్ స్కూల్ మొత్తం 26,597 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. వీరిలో ఓపెన్ స్కూల్ విధానంలో 1,200 మంది హాజరు కానున్నారని చెప్పారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలు, పరీక్ష పత్రాల మూల్యాంకనం కేంద్రంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావుకు అప్పగించామన్నారు.

ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఒక హెల్త్ అసిస్టెంట్‌ను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఏ కేంద్రానికి అయినా చేరుకునే విధంగా కీలక ప్రాంతాల్లో మెడికల్ వ్యాన్లను సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈవో చంద్రకళ, డీఎంహెచ్‌ఓ రవి, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు పాల్గొన్నారు.

డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడితే.. కఠినంగా వ్యవహరించాలి

కలెక్టర్ పి అరుణ్‌బాబు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడే వారిపై కఠినంగా వ్యవహరించాలని, వారు హెల్మెట్ ధరించేలా చూడాలని పోలీస్ రవాణా శాఖ అధికారులను కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి అరుణ్‌బాబు

రోడ్డు ప్రమాదాల డేటాను పరిశీలించి ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. సంబంధిత శాఖలైన పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవేస్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రొంపిచర్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని నేషనల్ హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆయన కోరారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ యామలుపుల వద్ద సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు పెట్టాలన్నారు. అనంతరం నోడల్ అధికారి భద్రతా యాప్‌పై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి, ఆర్ అండ్‌బీ ఈఈ, ఆర్టీసీ ఆర్‌ఎం నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో.. డొక్కు బస్సులు


జీటీ రోడ్డులో ఇటీవల రోడ్డుపై ఆగిపోయిన చిలకలూరిపేట డిపో పల్లె వెలుగు బస్సు

- ప్రయాణం మధ్యలో ఆగిపోతున్న వైనం
- వైసీపీ పాలనలో ఒక్క బస్సూ కొనని వైనం
- ఉమ్మడి జిల్లాలో 60 శాతంపైనే పనికి రానివి

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త బస్సు కొనకపోవడంతో, దాని పర్యవసాన పరిస్థితులు నేడు ఆర్టీసీని వెంటా డుతున్నాయి. ప్రయాణీకులతో రాకపోకలు సాగించే బస్సులు మార్గమధ్యంలో అర్ధాంతరంగా నిలిచిపోతు న్నాయి. ఇటీవల వరుసగా బస్సులు మొరాయిస్తుం డటంతో ప్రయాణీకుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. తాజాగా గుంటూరు జీటీ రోడ్డులో గుండారావుపేట వద్ద ఇటీవల గుంటూరు - చిలకలూరిపేటకు రాకపోకలు సాగించే చిలకలూరిపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు అర్ధాంతరంగా నిలిచిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు ముందుకు కదలక పోవటంతో అందులోని ప్రయాణీకులను వేరొక బస్సులో చేర్పించి గమ్యస్థానాలకు చేర్చాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇదే విధంగా ఇటీవల కొన్ని రోజుల కిందటే జీటీ రోడ్డులోనే గుంటూరు నుంచి పిడుగురాళ్ల వెళుతోన్న బస్సు కూడా మార్గం మధ్యలో మొరాయించింది. అర్ధాంతరంగా నిలిచి పోవటంతో డ్రైవర్ సదరు బస్సులోని ప్రయాణీకులను మరో బస్సులోకి ఎక్కించారు. ఇదిలా ఉంటే ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 980కు పైగా బస్సులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో గుం టూరు-1, 2 డిపోలతో పాటు తెనాలి, మంగళగిరి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె, నరసరావుపేట, చిలకలూ రిపేట, మాచర్ల, వినుకొండ డిపోలలో బస్సులు 60 శాతం పైన డొక్కు బస్సులే ఉన్నట్లు ఆర్టీసీ వర్గాలే చెబు తున్నాయి. వాస్తవానికి 12 లక్షల కిలోమీటర్లు ప్రయా ణించిన బస్సులను తుక్కు కింద పరిగ ణించాల్సి ఉంటుంది. అటువంటి ఆర్టీసీ యంత్రాంగం ఆయా నిబంధనలు పాటించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనల మేరకు తిరగాల్సిన కిలో మీటర్ల కంటే అదనంగా తిరిగిన పల్లె వెలుగు బస్సులు కూడా నేటికీ ప్రయాణీకులతో రాకపోకలు సాగిస్తు న్నాయన్న విమర్శలున్నాయి. దాంతో మార్గమధ్యంలో ఎక్కడ మొరాయిస్తాయో తెలియని పరిస్థితులు నెలకొ న్నాయి. నిబంధనల ప్రకారం బస్సుల్లో రిపేర్లు వస్తే మరమ్మతుల నిర్వహణ కోసం ఉంచాల్సిన పరికరాలు (టూల్స్ కిట్‌లు) కూడా ఉండటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో బస్సులు ఆగిపోతే సదరు డిపోల నుంచి గ్యారేజ్ సిబ్బంది వెళ్ళి మరమ్మతులు చేయాల్సి పరిస్థితులు ఉంటున్నాయని ఆర్టీసీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డొక్కు బస్సుల స్థానంలో..

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ చేపడుతోంది. ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయటంతో పాటు అద్దె బస్సులను కూడా వినియోగించు కునేందుకు ప్రణాళికలు చేపడుతున్నారు. అంతేగాక పర్యావరణ పరిరక్షణంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో డొక్కు బస్సుల స్థానంలో కొత్త బస్సులు, కనీసం అద్దె బస్సులునైనా ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఇసుక ధరకు రెక్కలు


టన్ను రూ. 1100

- వారం రోజుల్లో టన్నుకు రూ 500 పెరుగుదల
- అధికారిక ఇసుక రీచ్‌ల నిలిపివేత
- అడ్డగోలుగా కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు ఈ నెల ఆరో తేదీతో అనుమతులు ముగిసాయి. దీంతో అధికారిక రీచ్‌లను మైనింగ్ శాఖ మూసివేసింది. ఇదే అదనుగా అక్రమార్కులు ఇసుక దందాకు తెర లేపారు. అర్ధరాత్రులు కృష్ణా నదిలో ఇసుక తవ్వి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో ఇసుక ధరకు రెక్కలు వచ్చాయి. టన్ను ఇసుక రూ. 1100కు విక్రయిస్తున్నారు. వారం రోజుల్లో టన్ను ఇసుకకు రూ. 500 వరకు ధర పెరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానానికి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఇసుక కోసం వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. మైనింగ్ శాఖ ఇసుక సరఫరా చేసే పరిస్థితి లేకపోవడంతో



వారు బ్లాక్ మార్కెట్‌పై ఆధారపడుతున్నారు. నరసరావుపేటలో సోమవారం టన్ను ఇసుక రూ. 1100కు విక్రయించారు. అధికారిక తవ్వకాలు లేకపోవడంతో, ఇసుక ధర మరింత పెరగవచ్చని తెలుస్తోంది. వారం రోజుల క్రితం టన్ను ఇసుక రూ. 550 నుంచి 600 వరకు లభించింది. అమాంతం ఇసుక ధర పెరగడంతో నిర్మాణ దారులు గుడ్లు తేలేస్తున్నారు. ముందుగా ఆర్డర్ చేస్తే చాలు చెప్పిన చోటుకు ఇసుక సరఫరా చేస్తున్నారు. అక్రమార్కులు మాత్రం ఎన్ని టన్నులు కావాలన్నా పుష్కలంగా ఇసుక సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్క లారీకి 30 నుంచి 35 టన్నుల వరకు లోడ్ చేస్తున్నారు. ఇసుక ఇక్కట్ల కారణంగా నిర్మాణాలు నిలిచిపోయి కార్మికుల ఉపాధికి గండి పడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి, అధికారిక రీచ్‌లను ప్రారంభించి ఇసుక సరఫరా మెరుగుపరచాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఏసీబీ వలలో.. చిలకలూరిపేట ఎంఈవో


ఎంఈఓ లక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు

- ఉపాధ్యాయుడి నుంచి రూ. 30 వేలు డిమాండ్
- రెడ్ హ్యాండెడ్ దొరికిన వైనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-1) కె లక్ష్మీ లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. లంచం ఇచ్చిన జూనియర్ అసిస్టెంట్ మాజేటి శ్రీనివాసరావును కూడా ఆమెతోపాటు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి గుంటూరు ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్లో చల్లా వెంకట శ్రీనివాసరావు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా (స్కూల్ అసిస్టెంట్) గా పనిచేసి గత జూలైలో పదవీ విరమణ చేశాడు. గత కొంత కాలంగా పెన్షన్‌తో సహా అతడికి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వడానికి ఎంఈఓ లక్ష్మి లంచం డిమాండ్ చేస్తూ వచ్చింది. సంబంధిత ఫైలును చిలకలూరిపేట సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపకుండా కాలయాపన చేస్తున్నది. దీంతో బాధితుడు చల్లా వెంకట శ్రీనివాసరావు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు తెలిపాడు. తాను పనిచేసిన విద్యాసంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న మాజేటి శ్రీనివాసరావు ద్వారా రు. 30 వేలు ఎంఈఓ లక్ష్మికి పంపారు.

ఎంఈఓ ఇంటి వద్దనే మాజేటి శ్రీనివాసరావు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. వీరిద్దరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. అధికారులు వీరిని విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరచనున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను లంచం కోసం ఎవరైనా వేధించినట్లయితే జిల్లా ఏసీబీ అధికారులకు గాని, ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు గాని, 94404 40057కు గాని తెలియపరచాలని ఏసీబీ అధికారులు కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి.. ముగిసిన నామినేషన్లు

- 43 మంది అభ్యర్థులు 69 నామినేషన్ల దాఖలు
- చివరి రోజున నామినేషన్ వేసిన 22 మంది
- నేడు గుంటూరు కలెక్టరేట్‌లో పరిశీలన

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ద్వైపాక్షిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ముగిసింది. నామినేషన్ల దాఖలుకు గడవు తేదీ అయిన ఈ నెల 10 (సోమవారం) ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు గుంటూరు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అభ్యర్థులు వారి వెంట వచ్చిన మద్దతుదారులతో కలెక్టరేట్ ప్రాంగణంలో కోలాహలం నెలకొన్నది. చివరి రోజైన సోమవారం మొత్తం 22 మంది అభ్యర్థులు 43 నామినేషన్లను దాఖలు చేశారు. దీంతో ఫారం- 3లను అప్‌లోడింగ్ చేయడానికి రాత్రి 8 గంటల వరకు పట్టింది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన చేపడతారు.


నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న లక్ష్మణరావు

ఈ నెల 3వ తేదీన ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడగా ఆ రోజు నుంచి నామినేషన్ల స్వీకార ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తంగా 40 మంది అభ్యర్థులు 69 నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుంటూరు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ప్రధాన అభ్యర్థుల్లో ఒకరైన ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరుపున ఆయన సతీమణి మాధవి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. చివరి రోజున సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ర్యాలీగా వచ్చి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలతో కలిసి నామినేషన్ వేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు యథేచ్ఛగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. వేర్వేరు ఉపాధ్యాయ సంఘాల్లో ఉన్న నాయకులు రాజకీయ పార్టీలతో అనుబంధంగా ఉంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిసి కూడా అభ్యర్థుల వెంట ర్యాలీలు, ఆత్మీయ సమావేశాలకు హాజరవుతున్నారు. కొంత మంది ఉపాధ్యాయులైతే పాఠశాలలకు సెలవులు పెట్టి మరీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నామినేషన్ల ప్రక్రియలో తలమునకలై ఉన్న ఎన్నికల యంత్రాంగం కోడ్ అమలును పట్టించుకోవడం లేదు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు నోడల్ అధికారుల నేతృత్వంలో బృందాలను నియమించినా అవి సక్రమంగా పని చేయడం లేదు. అభ్యర్థుల నామినేషన్ల దాఖలని రికార్డింగ్ చేస్తున్న వీడియోలను ఒకసారి పరిశీలిస్తే అవలీలగా కోడ్ ఉల్లంఘించిన ఉపాధ్యాయులను గుర్తించొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా జనరల్ ఎలక్షన్స్ వలే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఏ ఉద్యోగి అయినా అభ్యర్థులకు మద్దతుగా ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొనరాదు. అయితే నిఘా లేకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు నామినేషన్లు, ర్యాలీల్లోనూ పాల్గొంటున్నారు.


ఆలపాటి రాజా తరపున మరో సెట్ నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి మాధవి

విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో ఏప గ్రేడ్



అధ్యాపకులను అభినందిస్తున్న పి.నాగభూషణం

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయస్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో 'ఏప గ్రేడ్' లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో జాతీయస్థాయిలో 100లోపు ర్యాంక్ సాధించి "ఏప గ్రేడ్"ను సొంతం చేసుకుందన్నారు. ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ రకాల కోర్సులలో విజ్ఞాన్స్ యూనివర్సిటీకు చెందిన విద్యార్థులు పాల్గొని 2814 కోర్సు సర్టిఫికెట్లు సాధించారన్నారు. "ఏప గ్రేడ్" సాధించడానికి కృషి చేసిన టీం సభ్యులను విజ్ఞాన్స్ యూనివర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు అభినందించారు.

ఆర్‌వీఆర్ అండ్ జేసీకి జాతీయ స్థాయిలో ఏప రేటింగ్



సర్టిఫికెట్లు అందుకుంటున్న కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీటీఈఎల్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు కనబరిచిన విశేష ప్రతిభకు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలకు మద్రాస్ ఐఐటీ నుంచి జాతీయ స్థాయిలో ఏప ర్యాంకింగ్ వచ్చినట్లు కళాశాల అధ్యక్ష ,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు రెండు ప్రత్యేక అవార్డులు పొందినట్లు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపులో భాగంగా, కళాశాల విద్యార్థులు 85 గోల్డ్, 1,012 ఎలైట్, 439 సిల్వర్ గ్రేడ్‌లను సాధించడంతో పాటు 62 మంది టాపర్ సర్టిఫికెట్లు పొందారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ సమన్వయకర్త , కళాశాల సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➡ Wanted B.Sc Agri, Freshers for Polyhouse in Guntur. Salary : 15000/- whatsapp: 9479474629. AAA-9909

➡ మేల్ వార్డెన్ కావలెను : దయానంద వేద గురుకులం రాయపూడి గ్రామం బాలురు దినచర్య మరియు క్రమశిక్షణ ఉంచుటకు 50సం॥లలోపు మేల్ వార్డెన్ కావలెను. వసతి భోజనము ఉచితము. శాలరీ : 10,000/-. సంప్ర॥ 9985978380, 9440632175 AJG-204276

➡ మయూరి బార్ & రెస్టారెంట్లో F/P టైం పని చేయుటకు వెయిటర్లు, సప్లయర్లు, సూపర్ వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. రూం+భోజన వసతి కలదు. 7075338338, 8143198968. AJG-204372

➡ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th పాస్, 50 సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 99899 09698. AJG-210356

➡ విశ్రాంతి ఉద్యోగులకు శుభవార్త గుంటూరు నగరంలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు 10th పాస్, 50సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 9704399194 AJG-204374

➡ ప్రముఖ బ్యాంకు నందు పనిచేయుటకు ఉద్యోగులు కావలెను. జీతం : 30 to 75, గృహిణిలకు, రిటైర్‌మెంట్ వారికి ప్రాధాన్యత. సంప్ర॥ 9494954689. AJG-210359

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకే తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368 AJB-225788

రియల్ ఎస్టేట్

➡ శ్రీకృష్ణ బృందావనం ! ఫార్మ్ లాండ్ గుంటూరు నుండి బోయపాలెం మీదుగా కొండవీడు పర్యటక ప్రాంతం సమీపంలో సెంటు - లక్ష రూపాయలు (1Lac), పక్కా రిజిస్ట్రేషన్, సంప్ర॥ 9381449563. AJG-210353

అద్దెకు

➡ Tadepalli NH Bye pass west facing 3 BHK flat 2500 sqft Doctors Paradise Apt 4 ACs for rent. Ph: 7893067416 AJH-42161

జ్యోతిష్యాలయం

➡ లక్ష్మీ ప్రభ జ్యోతిష్యాలయం : వాస్తు, జ్యోతిష్యం, విదేశీ ప్రయాణం, ద్వితీయ వివాహం, నరఘోష, ఆస్తి, కోర్టు వివాదాలు లకు రెమిడీస్ చెప్పబడును. గొర్ల సత్యనారాయణ సిద్ధాంతి, సెల్ : 98491 68310 AJG-210360

పోయినవి

➡ దీదెళ్ళ సాయిహనుమంతరావు S/o. వెంకటరామకృష్ణ, ఫ్లాట్ నెం: 206, సాయి సమన్విత టవర్స్, చౌడేశ్వరమ్మ గుడి దగ్గర, పాతూరు నరసరావుపేటకు చెందిన నాకు సంబంధించిన M.B.A- 1st Sem, 2nd Sem, 3rd Sem, H.T.No: 15471E00A1 2015-2017 సం॥ తాలుకు ఒరిజినల్ మార్కులిస్ట్‌లు JNTU- కాకినాడకు సంబంధించినవి, మా పాత ఇంటి నుండి పైన తెలిపిన కొత్త ఇంటికి వెళ్ళుచుండగా మార్గమధ్యలో పోయినవి దొరికినవారు పై అడ్రస్‌కు గాని, Ph: 7989344757కు తెలుపగలరు. AJG-210304

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు

99854 03281

సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)



సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	98852 71281
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ తప్పనిసరి

- వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్
- ఉర్దూ బాలుర పాఠశాలలో మాత్రల పంపిణీ



విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయస్సు లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్ తెలిపారు. సోమవారం గుంటూరు పాతబస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులైన పిల్లలు, యువతీ, యువకులతో ఆల్బెండజోల్ మాత్రలను ఏక కాలంలో ఒకేరోజు మింగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఏడాదిలో రెండు సార్లు వీటిని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ వర్కర్లు ఈ కార్యక్రమంలో పిల్లల చేత మాత్రలు మింగిస్తారని తెలిపారు. ఈ మాత్రలు పిల్లల్లో నులిపురుగులను నిర్మూలిస్తాయన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోకపోతే పిల్లల్లో రక్తహీనత, ఎదుగుదల లోపాలు కనిపిస్తాయని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 4,24,742 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు అర మాత్ర కరిగించి తాగించాలన్నారు. మూడేళ్ల నుంచి 19 ఏళ్ల వారి వరకు పూర్తి మాత్ర చప్పరించి లేదా నమిలి మింగించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర బాల ఆరోగ్య రక్ష కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్, ఈ సందర్భంగా విద్యార్థులతో చేతుల పరిశుభ్రతపై డెమాన్‌స్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, మండల విద్యాశాఖాధికారి ఖుద్దూస్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎస్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్, డాక్టర్ గుణశ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధరా దేవి పాల్గొన్నారు.

లక్ష్మణరావు విజయం చారిత్రక అవసరం

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ, ప్రజా సంఘాల నాయకులు
- నగరంలో భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు



ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు, బాలసుబ్రమణ్యం

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో సామాన్య ప్రజల గొంతుక వినిపించడానికి ఎమ్మెల్సీగా కేఎస్ లక్ష్మణరావు గెలుపు చారిత్రక అవసరమని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. కృష్ణా,గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ తరపున కేఎస్ లక్ష్మణరావు నామినేషన్ సందర్భంగా సోమవారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గత 14 ఏళ్ల కాలంలో 18 మంది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు పనిచేశారని, ఎక్కడ ఎవరిపైనా ఎటువంటి అవినీతి ఆరోపణలు రాలేదన్నారు. నిజాయితీగా ప్రజల తరపున పోరాటం చేయడమే తప్ప మరో అంశం తమ దృష్టిలో ఉండదన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మండలిలో ఉండబట్టే గత ప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు రాజధానుల బిల్లును ఓడించామన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ లక్ష్మణరావు తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారన్నారు. ఎమ్మెల్సీ బి గోపి మూర్తి ప్రసంగిస్తూ ప్రస్తుత వైసీపీ వారు శాసనసభకు వెళ్లడం లేదని, అధికార పక్షం ఏకపక్షంగా తీర్మానాలు చేసుకుంటుందని, ఇలాంటి సమయంలో ప్రజల కోసం మాట్లాడే పీడీఎఫ్ ఎమ్మెల్సీల గెలుపు ఎంతో అవసరం అన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ గతంలో 100 రోజులకు పైగా జరిగే శాసనసభ సమావేశాలు ఇప్పుడు 20 రోజులు కూడా జరగడం లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రధాన ప్రతిపక్షమే రావడం లేదన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో తనకు ఊహించని ఆదరణ ఉందని ధీమా వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాతలు పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా మండలిలో కొన్ని స్థానాలు కేటాయిస్తే వీటిల్లోకి రాజకీయ పార్టీలు పోటీ చేయటం వలన ప్రజలకు మేలు జరగదన్నారు.

నగరంలో భారీ ర్యాలీ....

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి ఈ నెల 27వ తేదీన జరగనున్న శాసన మండలి ఎన్నికలకు పీడీఎఫ్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.ఎస్ .లక్ష్మణరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, కార్మిక, కర్షక, మహిళా ప్రజా సంఘాల ప్రతినిధులు భారీ ర్యాలీగా తరలివచ్చి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వామ పక్షాల కళాజాత ఆకట్టుకుంది. స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కె. రాములు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ. చిస్తి, ఐలూ రాష్ట్ర నాయకులు నర్రా శ్రీనివాసరావు, రమేష్, ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు నాగయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు సుబ్బారావమ్మ, ధనలక్ష్మి, కుమార్, స్వాతీ, యూటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేద్యం విభాగంలో వేటపాలెం ఎద్దులు ప్రథమ స్థానం



సేద్యం విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దులు


మాచవరం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలం, మోర్జంపాడు గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి 69వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ స్థాయిలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. పోటీలను మాజీ ఎంఎల్‌సీ, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి సోమవారం ప్రారంభించారు. సేద్యం విభాగంలో నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివ కృష్ణ చౌదరి ఎడ్లు 4935.6 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరు గ్రామానికి వజ్రాల తేజశ్రీరెడ్డి ఎడ్లు 4,800 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరి గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లు 4754.9 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లు 4,400 అడుగుల దూరాన్ని లాగి 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందనం గ్రామానికి చెందిన సంపటం వీర బ్రహ్మనాయుడు ఎడ్లు 4302.3 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానం, కృష్ణా జిల్లా గన్నవరం మండలం చంపల్లి గ్రామానికి చెందిన పోలుసు శ్రీనివాసరావు యాదవ్ ఎడ్లు 4,200 అడుగుల దూరాన్ని లాగి ఆరో స్థానంలో నిలిచాయి. తెలంగాణా రాష్ట్రం కోదాడ మండలం, కోదాడ గ్రామానికి చెందిన జక్కుల సహస్ర యాదవ్ ఎడ్లు 4068.1 అడుగుల దూరాన్ని ఏడో స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో మొత్తం తొమ్మిది జతలు ఎడ్లు పాల్గొన్నాయి. వీరికి వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేలు, రూ. 8 వేలు నగదు బహుమతులతో పాటు షీల్డ్ బహూకరించారు.

ఆరుపళ్ల విభాగంలో వేటపాలెం ఎడ్లు ప్రథమ స్థానం

ఆరుపళ్ల విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివ కృష్ణ చౌదరి ఎద్దులు 5120.9 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెం గ్రామానికి రామినేని రత్తయ్య చౌదరి, పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామానికి చెందిన ఏటూకూరి శ్రీనివాసరావు కంబన్డ్ జత 4234.6 అడుగుల దూరాన్ని రెండో స్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు ఎడ్లు 4214.2 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గంగపాలెం గ్రామానికి చెందిన రాయుడు సుబ్బారావు కంబైన్డ్ జత 4191.2 అడుగుల దూరాన్ని లాగి నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కృష్ణా జిల్లా పెనుమచ్చ గ్రామానికి చెందిన సూరపనేని రాధాకృష్ణ, దుర్గి గ్రామానికి దుగ్గి శ్రీనివారావులు వ్యవహరిస్తున్నారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

- సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరి
- మంగళగిరి స్టేడియంలో ఐప అండ్ ఏడీ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం
- తొలిరోజు కేరళ, తమిళనాడు జట్ల గెలుపు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న భాస్కర్ కల్లూరి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధుల్లో నిమగ్నమై ఉంటున్న ఉద్యోగులకు క్రీడలతో ఆటవిడుపు లభించడంతో పాటు మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని విజయవాడ ఆడిట్ జనరల్ కార్యాలయం సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ భాస్కర్ కల్లూరి అన్నారు. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఐప అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంటు-2025 సోమవారం ప్రారంభమైంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల జట్ల తరపున సుమారు 80 మంది క్రీడాకారులు విచ్చేశారు. ఆడిట్ జనరల్ కార్యాలయం సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ భాస్కర్ కల్లూరి, కిశోర్ రెడ్డి, ఆర్.శ్యామ్, రాకేష్ నాయక్, ఎన్.నిఖిల జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో తొలిసారిగా సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇందుకు మంగళగిరి అంతర్జాతీయ స్టేడియం అద్భుతమైన వేదికగా నిలిచిందన్నారు. మంగళగిరి స్టేడియానికి అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపడితే మరింత సౌకర్యవంతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన అనంతరం తొలిసారి ఏపీలో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ టోర్నీలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు రంజీ, ఐపీఎల్ వంటి టోర్నీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు.

తొలిరోజు ఆంధ్రప్రదేశ్-తెలంగాణ, కేరళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఏపీ-తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. రవితేజ 40, యశ్ కొఠారి 26 పరుగులు చేయగా, కేరళ బౌలర్ అంకిత్ మిశ్రా 4 ఓవర్లలో 17 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు 18.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసి విజయం సాధించింది. మహమ్మద్ షన్ను 43 పరుగులు, శాలీ శాంసన్ 25 పరుగులు చేశారు. రెండో మ్యాచ్‌లో తమిళనాడు, కర్ణాటక జట్లు తలపడ్డాయి. తమిళనాడు జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. కర్ణాటక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. హెచ్.అర్జున్ 47, శరత్ 40 పరుగులు, జే.సుచిత్ 31 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు ఆఖరి బంతి వరకు పోరాడి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వేదాంత్ భరద్వాజ్ 57 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 83 పరుగులు, విఘ్నేష్ 27 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్లు దర్శన, జై చెరో రెండు వికెట్లు పడగొట్టారు. కాగా, మంగళవారం ఆంధ్ర-తెలంగాణ, తమిళనాడు జట్ల మధ్య మొదటి మ్యాచ్, కేరళ, కర్ణాటక జట్ల మధ్య రెండో మ్యాచ్ జరుగనుంది. తొలుత ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నీలం మణి శ్రావణిని నిర్వాహకులు అభినందించారు. గతంలో కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ సర్టిఫికెట్ పొందడమే కాకుండా ఆక్లాండ్‌లో జరిగిన 84 కిలోలు పైబడిన విభాగంలో ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ క్లాస్ సబ్ జూనియర్ కోటాలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది.



క్రికెట్ టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం



మృతురాలికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారిపాలెంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన మదిర గంగమ్మ, మదిర సామ్రాజ్య, తేనేపల్లి పద్మావతి, చెక్కెర మాధవిల మృతదేహాలను సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని మృతుల కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. నాయకులు దరువూరి నాగేశ్వరరావు, గోగినేని కోటేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, కల్లం విజయ భాస్కర్‌రెడ్డి, మదిర రామ్మోహన్‌రెడ్డి, మారూరి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు

మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

ముప్పాళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారిపాలెంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ తిరగబడి మృతి చెందిన మదిర గంగమ్మ, మదిర సామ్రాజ్యం, తేనేపల్లి పద్మావతి, చెక్కెర మాధవి మృతదేహాలను సోమవారం జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సందర్శించి మృతుల కుటుంబాలకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలును తక్షణ సాయంగా అందించారు. అనంతరం ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు ఏమైనా ఉన్నాయో చూడాలని తహసీల్దార్ ఎం భవాని శంకర్‌కు సూచించారు.

ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి కావాలి: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆధార్ ఎన్‌రోనోల్‌మెంట్ ప్రక్రియ పూర్తి కావాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవల్ ఆధార్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ 0-5 సంవత్సరాల ఆధార్ ఎన్‌రోనోల్‌మెంట్ పూర్తి కావాలని, 15 నుంచి 17 సంవత్సరాల మాండేటరి బయోమెట్రిక్ పెండింగ్స్ కంప్లీట్ చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 107 ఆధార్ కిట్లు ఉంటే వాటిలో 67 ఆధార్ కిట్లు వివిధ మండలాల్లో పనిచేస్తున్నాయని చెప్పారు. మిగతా 44 కిట్లు కొన్ని హార్డ్‌వేర్ సమస్యలు ఉండటం వలన పనిచేయడం లేదని తెలిపారు. కాగా వాటిని పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతి ఆధార్ కేంద్రంలో సేవలకు సంబంధించి ప్రైస్ చార్ట్‌ను విధిగా డిస్‌ప్లే చేయాలన్నారు. జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి ఎం.వెంకటరెడ్డి, జిల్లా ఆధార్ కోఆర్డినేటర్ ఎం.రమేష్‌లకు క్షేత్రస్థాయిలో అధికారులు సహకరించాలని ఆదేశించారు.

ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంఘం ఏర్పాటు

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంఘం ఏర్పాటైంది. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ నూతన సంఘం ఏర్పాటుకు తీర్మానం చేసి ఆమోదించారు. విశ్రాంత డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా యండమూరి నాగరాజు(పశ్చిమ గోదావరి)ని ఎన్నుకొన్నారు. మిగిలిన కార్యవర్గం ఎన్నిక కోసం జిల్లాల పర్యటన చేయాలని తీర్మానించారు. విశ్రాంత డ్రైవర్ల సంఘానికి ఎన్నికైన అధ్యక్షుడు యండమూరి నాగరాజు మాట్లాడుతూ తాము ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి అనుబంధంగా పని చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు వేంపాటి పాపారావు మాట్లాడుతూ గుంటూరు జిల్లా విశ్రాంత డ్రైవర్ల సంఘానికి అధ్యక్షుడిగా మొగిలి గురవయ్య, కార్యదర్శిగా కొల్లి కోటిరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా కఠారి హన్మంతరావు, ముఖ్య సలహాదారుడిగా ఎం కోటేశ్వరరావు నాయక్‌ని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జే మునిబాబు, జీహెచ్ నాగులు, కే సాల్మన్‌రాజు, ఎంఆర్ మనోహర్, కే నాగిరెడ్డి, రాయుడు సత్యన్నారాయణ, ఏ భాస్కర్, ఏ అప్పలనాయుడు, ఎం రామారావు, వీ వెంకటేశ్వరరావు, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు

పెదనందిపాడు, ఫిబ్రవరి, 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గుంటూరు-పర్చూరు రహదారిలో స్థానిక వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం అంతర్ జిల్లాల పోలీసు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్ట్‌ను ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆయా నాయకులు నగదు, వస్తువులను తరలిస్తుంటారని వీటిపట్ల అప్రమత్తంగా ఉండి వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ మధుపవన్ ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న రొంపిచర్ల మండలం బాపన్నపాలెంలో జరిగిన సుమారు రూ.11 లక్షల విలువైన నగదు, బంగారు ఆభరణాలు చోరీ కేసులో నిందితుడైన అదే గ్రామానికి చెందిన వల్లెపు విష్ణువర్ధన్‌ను సోమవారం రొంపిచర్ల చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిర్యాది చల్ల అంజమ్మ చెల్లెలి కొడుకే నిందితుడు అని తెలిపారు. నిందితుడు వెటర్నరీ డాక్టర్ పని చేస్తుంటడానీ, మద్యం, పేకాట వ్యసనాలకులోనై చోరీలకు పాల్పడుతున్నాడని వివరించారు. కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కాకుమాను, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దర మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ పృథ్వీ ఏక్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కాకుమానుకు చెందిన పినపాల చలం (59) బాపట్ల పెదనందిపాడు ప్రధాన రహదారిలో పెదనందిపాడు వైపు వెళ్తూ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే కొండపాటూరుకు చెందిన బొల్లిమేర లెనిన్(24) ప్రయాణికులను దింపి తిరిగి కాకుమానుకు వెళుతున్న సమయంలో దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డు పక్కనే ఉన్న నీటి కాలువలో పడిపోవడంతో మృతి చెందాడు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,55,519 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,67,623 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,55,519 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 77,687 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13600	334	9500	11500
నెంబరు. 5	9500	13500	నెంబరు.5	8500	8500
273	10000	13500	273	--	--
341	10000	14500	341	9500	9500
4884	9000	12000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800	తేజ	10000	13300
బ్యాడిగి	10000	13200	బ్యాడిగి	11000	12000
దేవనూరు డీలక్స్	10000	13400	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	7500	తెల్లకాయలు	4500	7500

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11225 | 99854 01330
99854 01690 | 99854 77867

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 32.48 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని రాజు తెలిపారు.



ఉయ్ సర్వ్ ఇండియా అవార్డ్‌తో జాజి

పర్యావరణవేత్త బాజీకి ఉయ్ సర్వ్ఇండియా అవార్డు

కారంపూడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) వుయ్ సర్వ్ ఇండియా అవార్డును అందుకున్నారు. ఈనెల 5వ తేదీన కేరళలోని కొచ్చిన్‌లో ముంబైకు చెందిన ఫోర్బ్స్ వుయ్ సర్వ్ ఇండియా సంస్థ వైల్డ్ లైఫ్ కంజరేషన్ విభాగంలో అడవుల సంరక్షణ, వృద్ధి, వణ్య ప్రాణుల రక్షణకు జాజి చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేసింది. ఈ అవార్డు రావడం తన బాధ్యతను మరింత పెంచిందని జాజి అన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య 7252

రెంటచింతల,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పట్టభద్రుల ఓటర్లు 7252 మంది ఉన్నట్లు రెవెన్యూ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలాల వారిగా దుర్గి 990, కారంపూడి 1058, మాచర్ల రూరల్ 1079, మాచర్ల టౌన్ 2317, రెంటచింతల 833, వెల్దుర్తి 970, ఇతర ప్రాంతాల్లో 5 మంది ఉన్నట్లు తెలిపారు.

ఓర్వకల్లు తిరునాళ్ల నిర్వహణపై అధికారుల సమావేశం

అచ్చంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓర్వకల్లులో 12వ తేదీ బుధవారం గంగాదేవి పేరంటాళ్ళ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో మండల అధికారులు తిరునాళ్ళ నిర్వాహణపై సోమవారం సమావేశం నిర్వహించారు. తిరునాళ్ళలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కట్టు దిటమైన చర్యలపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, సీఐ వెంకట ప్రసాదు, ఆలయ ఈవో ఎం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● రూ. 45,250 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

మాచర్లరూరల్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు గ్రామ శివారు పొలాల్లో పేకాట స్థావరంపై సోమవారం మాచర్ల రూరల్ ఎస్ఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని రూ. 45,250 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

రెంటచింతల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలోని బైపాస్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి గాయాలయ్యాయి. రెంటచింతలకు చెందిన యెనిగళ్ల శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై గురజాల నుంచి రెంటచింతలకు వస్తుండగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీనివాసరావు కాలుకి తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ఆస్పత్రికి తరలించారు.

ఈవోగా పూర్ణచంద్రరావు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఈవోగా పూర్ణచంద్రరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గురజాల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సాంబయ్య రేపల్లెకు బదిలీపై వెళ్లారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

పెదకూరపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 75 తాళ్ళూరు, పెదకూరపాడు ప్రభుత్వ వైద్యశాలల్లోని గర్భిణులకు మాగులూరి ఫౌండేషన్ వారు సోమవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, తెలుగు మహిళా నేత కోండ్రు పద్మావతి పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల ఊరేగింపు

బెల్లంకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ యాదవ బజారులో గల లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి వార్ల ఊరేగింపు కార్యక్రమాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఈ ఊరేగింపు నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు స్వామివార్లకు హారతులు పట్టారు.

మాల మహానాడు మండల అధ్యక్షుడిగా నరసింహారావు

క్రోసూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మాల మహానాడు క్రోసూరు మండలం అధ్యక్షుడిగా జెల్లి నరసింహారావును నియమించారు. ఈ మేరకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ చేతుల మీదుగా సోమవారం నరసింహారావు నియామక పత్రాన్ని అందుకున్నారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌పాల్‌కు ఈ సందర్భంగా నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జిగానూ నరసింహా రావు వ్యవహరిస్తారని జాన్‌పాల్ తెలిపారు.

బీసీ బాలికల హాస్టల్ నిర్మాణం జరిగేనా?

- అప్పటి శాసనసభాపతి కోడెల చొరవతో ఐదు ఎకరాల స్థలం కేటాయింపు
- 2018లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- అనంతరం అధికారంలోకి వైసీపీ
- మూలనపడిన నిర్మాణ పనులు
- కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలు



బీసీ బాలికల వసతిగృహ నిర్మాణానికి కేటాయించిన భూమి



చంద్రబాబునాయుడు ఆవిష్కరించిన శిలాఫలకం

రాజుపాలెం,ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలో రాజుపాలెం మండలం అన్ని రంగాలల్లో బాగా వెనుకబడింది. అందుకే గతంలో నవ్యాంధ్ర తొలి శాసన సభాపతి కోడెల శివప్రసాద రావు స్వంత నియోజకవర్గంలోని ఈ మండలంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు విద్యావంతులు అయినప్పుడే ఆ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని బలంగా విశ్వసించిన డాక్టర్ కోడెల ముందుగా రాజుపాలెం ప్రాంతంలో బాలికా విద్యాభివృద్ధికి పునాది వేయాలనుకున్నారు. అందుకోసం రాజుపాలెం కేంద్రంగా నియోజకవర్గ స్థాయి బీసీ బాలికల వసతిగృహం ఏర్పాటు చేసేం దుకు పూనుకున్నారు. రాజుపాలెం సమిపంలోఉన్న కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయం ప్రక్కనే ప్రభు త్వ భూమి ఉందని గుర్తించి దానిని బీసీ బాలికల వసతిగృహ నిర్మాణానికి కేటాయించాలని అధికారుకు ఆదేశాలు జారీ చేశారు. ఆ వెంటనే తహసీల్దార్ కార్యాలయం రంగంలోకి దిగి కస్తూర్భా గాంధీ బాలి కల విద్యాలయం సమిపంలో సర్వే నెంబరు 229లో మొత్తం 4.66 ఎకరాల భూమిని కొలిచి అనంతరం బీసీ వెల్ఫేర్ శాఖకు అప్పగించారు.

సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన

మహాత్మ జ్యోతీబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పేరుతో నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం రూ.37 లక్షల నిధులు కేటాయించింది. 2018 నవంబరు 26న నియోజకవర్గ పర్యటనకు వచ్చిన అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు డాక్టర్ కోడెల శివ ప్రసాదరావుతో కలిసి బీసీ బాలికల వసతి గృహ నిర్మాణానికి శంకు స్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు.

వైసీపీ రాకతో పనులకు ఫుల్ స్టాప్..

2019 సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనుల కొనసాగిపునకు ఫుల్‌స్టాప్ పెట్టింది. దీంతో నియోజకవర్గంలో కొండమోడు-పేరేచర్ల రహదారి నిర్మాణం, కృష్ణా గోదావరి టు పెన్నా నదుల అనుసందానం, బీసీ బాలికల వసతి గృహ నిర్మాణం పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గంలో మండలాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పని చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమై వైసీపీ అనంతరం వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన బీసీ బాలికల వసతిగృహ నిర్మాణంపై దృష్టి సారించాలని మండలంలోని ప్రజలు కోరుకుంటున్నారు. కూటమి ప్రభుత్వ హయంలోనే మహత్మ జ్యోతీబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్మాణం జరిగేనా? అని మండలంలోని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

కూటమి ప్రభుత్వం చొరవ చూపాలి



మండల కేంద్రం రాజుపాలెం అభివృద్ధికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఎంతో కృషి చేస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలోనే జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూర్భా గాంధీ బాలికల విద్యాలయ నిర్మాణం, బీసీ బాలుర వసతి గృహ నిర్మాణం వంటివి జరిగాయి. నియోజకవర్గ స్థాయి బీసీ బాలికల వసతి గృహం నిర్మాణం చేపట్టే విధంగా ఆయన కృషి చేయాలి.

- పులిబండ్ల సాంబశివరావు

బీసీల అభ్యున్నతికి కృషి చేసేది టీడీపీయే..



మండలంలో బాలికలలో విద్యాభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో ఆనాడు అనాడు డాక్టర్ కోడెల వసతి గృహ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కోడెల కోర్కెను తప్పక నెరవేర్చుతుంది. ఇందుకోసం ఎమ్మెల్యే కన్నా ప్రత్యేక చొరవ తీసుకుంటారు.

- వల్లపాటి పెద్దిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ ఆలపాటి రాజేంద్ర ప్రసాదును అధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాయలంలో ఆయన కూటమి ముఖ్య నేతలు, బూత్ కో-ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1540 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ప్రతి 30మందికి ఒక కో-ఆర్డినేటర్ చొప్పున 52 మందిని నియమించామని, వారు టీడీపీ ముఖ్య నేతలను సమన్వయం చేసుకుంటూ ఆలపాటికి రాజాకి ఓటు వేసేలా చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అలాగే ఓటర్లందరికీ బ్యాలెట్ పేపర్‌లో ఆలపాటికి ఓటు వేసే విధానం గురించి వివరించాలన్నారు. ముందుగా ఎమ్మెల్యే క్రోసూరులోని జైభారత్ హైస్కూల్ ఉపాధ్యాయులను కలుసుకున్నారు. ఆలపాటి రాజాకు ఓటు వేసి గెలిపించాలని వారిని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు ఏకే చౌదరి, పెదకూరపాడు బుజ్జి, కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, నలజాలసదాశివరావు పలువురు నేతలు పాల్గొన్నారు.



క్రోసూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి,(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని పలు పాఠశాలల్లో సోమవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలో తొలి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీ వరప్రసాద్, కె.వసంతరావు పాల్గొన్నారు.



అమరావతిలోని ప్రైవేట్ స్కూలు సిబ్బందితో ఎమ్మెల్యే ప్రవీణ్

విద్యుత్ మోటార్లలో వైర్లు చోరీ

దాచేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి మండలంలోని మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం, పెదగార్లపాడు, కేసానుపల్లి పంట పొలాల్లో విద్యుత్ మోటార్ల వైర్లు చోరీకి గురవుతున్నాయి. విద్యుత్ వైర్లలో ఉండే రాగి తీగల కోసం దొంగలు వైర్లను దొంగతనం చేస్తున్నారని రైతులు తెలిపారు. కేవలం రూ.200 విలువగల రాగి తీగల కోసం రూ.10 వేలు విలువైన వైర్లను దొంగిలిస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో పలువురు రైతులు ఫిర్యాదు చేశారు.

పకడ్బందీగా భూ రీసర్వే పనులు

మాచర్లరూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేను తప్పులు దొర్లకుండా, పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు.మండలంలోని ముత్యాలంపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని రెవెన్యూ అధికారులు చేపడుతున్న భూ రీసర్వే పనులను సోమవారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 818 ఎకరాల భూమి ఉందని, ఇందులో 130 ఎకరాలు పట్టాభూమి కాగా మిగతాది ప్రభుత్వ భూమి అన్నారు. పట్టా భూముల రైతులకు నోటీసులు ఇచ్చిన అనంతరమే కొలతలు తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ బత్తుల వాణి, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, మండల సర్వేయర్ రఘుపతి, సర్వేయర్ జింకల ఆదినారాయణ, వీఆర్ఏ మారపాకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల,(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో భూ రీసర్వే పనులను వేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.అర్జున్ నాయక్ ఆదేశించారు. సోమవారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పర్కిష్కరించాలని, అసైన్డ్ భూమలకు పట్టాలిచ్చి ఫ్రీహోల్డ్‌లో పెట్టిన భూములను, జగనన్న ఇంటి స్థలాలను పరిశీలించాలని కోరారు. సమావేశంలో ఆర్ఐ పల్లా రామకృష్ణ, డీటీ బ్రహ్మం, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

దాచేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా రోడ్డుభద్రత నియమాలను పాటించాలని ఎస్ఐ సౌదర్‌రాజన్ సూచించారు. సోమవారం మండలంలోని ఆంధ్రాసిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సౌదర్ రాజన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ సేఫ్టీ మేనేజర్ సంజయ్ కుమార్‌సింగ్, వేణు, రామకృష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నీటి కొరత లేకుండా ప్రణాళిక

● మునిసిపల్ కమిషనర్ శ్రీధర్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవి కాలంలో పట్టణ పరిధిలో ఎక్కడ కూడా నీటి కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో వార్డు సెక్రటరీ, పలుశాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మార్చి ఆఖరికి ఇంటి పన్నును వందశాతం పూర్తిచేసేలా చూడటంతో పాటు ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద మంజూరైన గృహ నిర్మాణం, హౌస్‌హోల్డ్ సర్వేపై అధికారులకు తగు సూచనలు చేశారు. సమావేశంలో ఏఈ రాఘవేంద్ర, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ పరిశీలన.. పట్టణంలోని కట్టెల అడితి సెంటర్‌లో వున్న అన్నక్యాంటీన్‌ను సోమవారం మునిసిపల్ కమిషనర్ శ్రీధర్ పరిశీలించి క్యాంటీన్ నిర్వాహకులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు

రెంటచింతల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమృకోట గ్రామానికి చెందిన బాలిక ఆదివారం అదృశ్యమైంది. తల్లిదండ్రులు మహాది, అమరద్దీన్‌లు సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

● స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయిజంక్షన్‌లో ఉన్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఆలయ 20వ వార్షికోత్సవ కార్యక్రమాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. పూజారి గణపతి శాస్త్రి నేతృత్వంలో పంచామృతాభిషేకం, శాంతి కళ్యాణం, లక్ష్మీగణపతి నవగ్రహ పూజలు చేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. ఆలయచైర్మన్ పాశం లచ్చిరెడ్డి నేతృత్వంలో భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెదకూరపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని బలుసుపాడులో సోమవారం ఉదయం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం బలుసుపాడు గ్రామానికి చెందిన మట్టిగుంట సురేష్ బాబు తన మొక్కజొన్న పొలానికి సాగు నీరు పెట్టడానికి వెళ్లి ద్విచక్రవాహనంపై కాశిపాడు వైపు నుంచి బలుసుపాడు వస్తున్నాడు. ఆ సమయంలో అమరావతి వైపు నుంచి వస్తున్న కారు, సురేష్‌బాబు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్‌బాబుకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న, సీఐ వెంకట్రావు, పోలీసులు ద్విచక్ర వాహనదారులు

హెల్మెట్ రహిత ప్రయాణం వద్దు

● పిడుగురాళ్ల సీఐ ఎస్.వెంకట్రావు

● వాహనదారులకు ఉచితంగా హెల్మెట్ల పంపిణీ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయవద్దని సీఐ ఎస్.వెంకట్రావు సూచించారు. సోమవారం పట్టణంలోని బైపాస్ రోడ్డు ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై సీఐ వెంకట్రావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, పరిమితికి మించి వేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం వలనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. జానపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత ముప్పాళ్ల సాంబశివరావు రూ.50 వేల ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన హెల్మెట్‌లను ద్విచక్ర వాహనదారులకు సీఐ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శివనాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించాలి

పెదకూరపాడు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాదుకు ఓటు వేసి గెలిపించాలని మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. పెదకూరపాడులో సోమవారం పట్ట భద్ర ఓటర్లుగా నమోదైన వారి ఇళ్ళకు వెళ్ళి ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీ బి.రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు సత్తెనపల్లి విద్యార్థులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లికి చెందిన విద్యార్థులు ఎం.దేవీశ్రీ, బి.అక్షయరెడ్డి, బి.బాల వైష్ణవి, టి.నిఖిత, మరో నలుగురు జాతీయ స్థాయి కరాటేపోటీలకు ఎంపికయ్యారని కరాటే అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నల్లూరు మోహనరావు, ట్రైనర్లు అనుముల రాంబాబు, రామయ్యలు సోమవారం విలేకరులకు తెలిపారు. కృష్ణా జిల్లా విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో సత్తెనపల్లికి చెందిన 11 మంది విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారన్నారు. వీరిలో ఎనిమిది మంది జాతీయ పోటీలకు ఎంపిక కాగా వారు జూన్‌లో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలలో రాష్ట్రం తరఫున పాల్గొననున్నారని నల్లూరు మోహనరావు తెలిపారు.



జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ముప్పాళ్ళ హైస్కూల్లో విద్యార్థికి నులిపురుగుల మందు వేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నులి పురుగులను నిర్మూలిద్దాం

● డీ వార్మింగ్ డే కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు

● 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆల్‌బెండజోల్ మందు పంపిణీ

ముప్పాళ్ళ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను శక్తిహీనులుగా మార్చే నులి పురుగులను సమూలంగా నిర్మూలిద్దామని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. ముప్పాళ్ళ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ బెండజోల్ మాత్రలను ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లందరికీ వేయాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.రవి, డీఈవో చంద్రకళ, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఎంపీడీవో పీజే విలియమ్స్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూర్భా గాంధీ, మోడల్ స్కూల్లో విద్యార్థులచే తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, వైద్యాధికారులు రమ్య, లక్ష్మీమౌనికలు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎంఈవో టీ. రవికుమార్, ఈవోపీఆర్డీ కసిన్యానాయక్, సూపర్‌వైజర్లు మల్లయ్య, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) : మండలంలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు బాలబాలికలు 12,337 మంది ఉండగా 9,622 మందికి ఆల్‌బెండజోల్ టాబ్లెట్లను వేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీ రాంబాబు, ఆరోగ్య విస్తరణ అధికారి పీ వెంకటరావు తెలిపారు.

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలో 7,952 మందికి ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్టు 75 తాళ్ళూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వెలుగొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు విజయ కుమార్, దిలీప్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మందులు పంపిణీచేశారు. మళ్లీ 17వ తేదీన మందు అందజేస్తామని వైద్యాధికారి ప్రసాదు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంగళరావు, ఎంఈవో శ్రీధర్, వైద్యాధికారులు అన్వేష్, ప్రసాదు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలో 19 సంవత్సరాల లోపు ఉన్న 96 శాతం మందికి నులి ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ తెలిపారు. క్రోసూరులోని ఉర్దూ యూపీ స్కూల్లో విద్యార్థులకు ఆయన ఆల్‌బెండజోల్ మాత్రలను మిగించారు. కార్యక్ర మంలో వైద్యాధికారులు సిరిచందన, షాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి మండలంలో 13 వేల మంది చిన్నారులకు ఆల్‌బెండజోల్ మందును ప్రభుత్వ వైద్యులు డాక్టర్ అమూల్య, మధు, ఎంపీడీవో రత్నం, ఎంఈవో పినాకపాణి, ఎంపీహెచ్ఏఈవో పట్టాభి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు పంపిణీ చేశారు.

నకరికల్లు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్ బెండజోల్ టాబ్లెట్లను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పంపిణీచేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎల్‌డీవో వై రాజగోపాల్, ఎంపీడీవో జీ.కాశయ్య, ఈవోఆర్డీ కేవీఎస్ ప్రసాదు, వైద్యాధికారులు బీ.మణికంఠ, హసీనా, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.పూజాశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీ లీలాకృష్ణ, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వర్లు, ప్రశాంతి, ఏఎన్ఎంలు అనురాధ, రత్నకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

విలీన ప్రక్రియ అనంతరం అభివృద్ధిపై దృష్టి

● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ గ్రామం పంచాయతీ విలీన ప్రక్రియ అనంతరం గ్రామాభివృద్ధిపై దృష్టి పెడతామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం విజయపురిసౌత్‌లో గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చిలో ఉపవాస ప్రార్థనలు ముగింపు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని విజయపురిసౌత్ వాసులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. విజయపురిసౌత్ పంచాయతీలో విలీనం ప్రక్రియ అనంతరం ప్రభుత్వానికి భూములు స్వాధీనమైన తర్వాతే మిగులు భూముల పంపిణీ గురించి ఆలోచించే అవకాశం ఉంటుందన్నారు. విజయపురిసౌత్ గ్రామం పంచాయతీ ఏర్పాటుతో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అన్నారు.

ముందుగా చర్చిలో ఉపవాస ప్రార్థనల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరికీ ఏసుక్రీస్తు దీవెనలు ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకాంక్షించారు. డాక్టర్ దానియేలు ఆధ్వర్యాన ఈ ఉపవాస దీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీడీపీ నేతలు జూలకంటి అక్కిరెడ్డి, నేరేటి వీరాస్వామి యాదవ్, శేరెడ్డి గోపిరెడ్డి, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, గుండాల శ్రీను, అప్పలరాజు, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, ఆడెపు కోటయ్య, డాక్టర్ బసివిరెడ్డి, సత్తిబాబు, ఘంటా ధనుంజయరావు, చంద్రశేఖర్, మార్కు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణుల సమావేశంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఆలపాటి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

● పార్టీ శ్రేణులకు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా పిలుపు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి అయిన ఆలపాటి రాజేంద్ర ప్రసాదు గెలుపు కోసం నియోజక వర్గంలోని పార్టీ శ్రేణులందరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో నియోజక వర్గ ముఖ్య నేతలతో కన్నా సమావేశం నిర్వహించారు. ప్రతి 30 ఓట్లకు ఒక నేత ఉన్న దృష్ట్యా ఓటర్లను కలసి ఓట్లు అభ్యర్థించటం ద్వారా ఆలపాటి రాజేంద ప్రసాదు గెలుపు సునాయాస మవుతుందన్నారు. ఈ సదర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో టీడీపీ నియోజక వర్గ పరిశీలకులు తాత జయప్రకాష్ నారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి, నేతలు గోగినేని కోటేశ్వరరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, బత్తుల వెంకట స్వామి, నూర్‌బాషా జానీబాబు, వెంకటకోటయ్య, జయరామ్, రామచంద్రరరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

కళా మాణిక్యాలు!

● రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో ప్రతిభ ● సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణింపు

● ప్రదర్శనలతో సత్తా చాటుతున్న వేల్పూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న గైడ్ టీచర్ శ్రీనివాసరావు (ఫైల్)

పోటీలు.. విజయాలు

- 2024-25లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించిన కళోత్సవ్ పోటీల్లో హేమా టీం సభ్యులు మైమ్‌లో ప్రథమ స్థానాన్ని, నాగరోహిణి టీం సభ్యులు జానపద నృత్యం, కోలాటంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా జానపద నృత్యం, కోలాటం పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించారు.
- 2024లో నిర్వహించిన పల్నాడు బాలోత్సవం పోటీల్లో పాఠశాల విద్యార్థులు వివేక్, జశ్వంత్, సాయికృష్ణ క్విజ్‌లో ప్రథమ స్థానం సాధించగా, విద్యార్థిని నాగరోహిణి వ్యాసరచనలో మూడో స్థానాన్ని, మ్యాప్ పాయింటింగ్‌లో రెండో స్థానాన్ని సాధించింది. స్కిట్‌లో విద్యార్థి నందు టైమ్ మిషన్ నాటికని ప్రదర్శించి మూడోస్థానంలో నిలిచాడు.
- సైన్స్ ఫెయిర్‌లో బుక్ ఫెస్టివల్ పోటీల్లో పాఠశాల విద్యార్థి సంజయ్ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని, జిల్లా స్థాయిలో మూడో స్థానాన్ని సాధించాడు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర దినోత్సవ పోటీల్లో వ్యాసరచనలో నాగరోహిణి ప్రథమస్థానాన్ని సాధించగా, వక్తృత్వం వివేక్, క్విజ్‌లో వివేక్, జశ్వంత్, సాయికృష్ణ టీం ద్వితీయ స్థానాలు సాధించారు.
- 2024 జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో వ్యాసరచనలో శ్రీవల్లి ప్రథమ స్థానం, వక్తృత్వంలో వివేక్ ప్రథమ స్థానం, స్కిట్‌లో వివేక్ టీం ప్రథమ స్థానం, పాటల్లో శ్రీహేమలత రెండో స్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో అందరూ ఓటెయ్యాలి అన్న స్కిట్‌ను నిర్వహించి వివేక్ టీం ప్రథమ స్థానంలో నిలువగా, పాటల పోటీల్లో శ్రీహేమలత రెండోస్థానాన్ని సాధించి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు పొందారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులు, వారిని ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

శావల్యాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని విశ్వసించారు. తమకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించాలన్న తలంపుతో అందరికీ భిన్నంగా ఉండేలా కళాకారులుగా ఎదిగేందుకు అహర్నిశలు కృషి చేశారు. పేదరికం అనేది ప్రతిభకు ఏ మాత్రం అడ్డుకాదని నిరూపించారు వేల్పూరుకు చెందిన పేదింటి బిడ్డలు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పేరొందిన వివిధ కళా వేదికలపై అందరినీ ఆకట్టుకునేలా లఘు నాటికలు, డ్యాన్సులు, జానపద నృత్యం, కోలాటం, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, మ్యాప్ పాయింటింగ్ వంటి కళాత్మకమైన పోటీలలో ఉత్తమ ప్రదర్శనలిచ్చి మట్టిలో మాణిక్యాలుగా నిలిచారు వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోనే ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించి చదువుకొన్న పాఠశాలకు, పుట్టిపెరిగిన గ్రామానికి పేరు ప్రఖ్యాతులు సాధించారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో, బుక్ ఫెస్టివల్‌లో తృతీయ స్థానంలో నిలిచి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. విద్యతోపాటు క్రీడలు, కళాత్మక రంగాల్లో రాణిస్తూ తోటి విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. హెచ్ఎం మహబూబ్ సుభాని, గైడ్ టీచర్ జ్యోతి శ్రీనివాసరావు, తెలుగు ఉపాధ్యాయుడు మరియదాసు, పీడీ కాకుమాను రాజేష్ ప్రోత్సాహం తో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొంటూ ముందుకు సాగుతున్నారు.

భవిష్యత్‌లో ఇంకా రాణించాలి



జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున పాటల పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు పొందడం ఆనందంగా ఉంది. పోటీలకు వెళ్లడం వలన బయట ప్రపంచంపై అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో ఇంకా రాణించాలన్న పట్టుదల పెరుగుతుంది. పోటీలతో బిడియం తగ్గి అందరితో మాట్లాడే ధైర్యం వస్తుంది. చదవాలన్న ఆసక్తి పెరుగుతుంది. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది.

\- యారం శ్రీహేమలత, పాఠశాల విద్యార్థిని

కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు



సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని బుక్ ఫెస్టివల్‌లో తృతీయ స్థానాన్ని సాధించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతిని అందుకోవడం ఆనందంగా ఉంది. పోటీల్లో పాల్గొనడం వలన ఎన్నో కొత్త విషయాలు నేర్చుకొన్నాను. నా నైపుణ్యంపై నమ్మకం ఏర్పడింది. రానున్న రోజుల్లో మరింతగా కష్టపడి మరిన్ని బహుమతులను గెలుచుకొనేందుకు కృషి చేస్తాను.

\- జగం సంజయ్, పాఠశాల విద్యార్థి

అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నాం



విద్యార్థులు చదవుతోపాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారు. వారిని కళాకారులుగా, క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులందరం ఎంతో ప్రోత్సహిస్తున్నాం. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను నింపుతాయి. చదువులో కూడా ముందుంటారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించడం శుభపరిణామం.

\- మహబూబ్ సుభాని, హెచ్ఎం, వేల్పూరు జడ్పీ పాఠశాల



బుక్ ఫెస్టివల్‌లో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి (ఫైల్)

విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధి



విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల వైపు కూడా మొగ్గు చూపినప్పుడే వారిలో సర్వతోముఖాభివృద్ధి కలుగుతుంది. విద్యార్థులు ఆనందంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటా రు. విద్యార్థుల మధ్య స్నేహభావం పెరుగుతుంది. స్టేజీలపై ప్రదర్శనలివ్వడం వల్ల భయం పోతుంది. సాంస్కృతిక కార్యక్రమాల వలన ఒకరికి ఒకరు సహకారం, కష్టపడే తత్వాలు వృద్ధి చెందుతాయి.

\-జ్యోతి శ్రీనివాసరావు, పాఠశాల గైడ్ టీచర్

ధర్మసత్రం... లేదే లెక్కాపత్రం!

(5వ పేజీ తరువాయి)

ఆస్తులన్నట్టు ఇష్టానుసారం భవనాలు కట్టేసి అమ్మేసుకుంటున్న పరిస్థితీ లేకపోలేదు. కొన్ని సత్రాల్లో మాత్రమే దాతల లక్ష్యానికి విలువనిచ్చి అన్నదానం చేస్తూ వారి ఆశయాన్ని కాపాడుతుంటే, 80 శాతం సత్రాలు ట్రస్టీల ఇష్టారాజ్యమైపోయాయి. దీంతో దాతల సొమ్ము, ఆస్తులు స్వార్థపరుల పాలవుతున్నాయి. అందరికోసం ఉప యోగించాల్సిన ఆస్తుల్ని కొందరికోసం... అదికూడా సొంతానికి వాడేసుకుంటుంటే, దేవాదాయశాఖ మాత్రం కళ్లప్పగించి చూస్తోంది.

తెనాలి, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు వంటి పట్టణాలే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బాపట్ల, గుంటూరు జిల్లాలకంటే ఎక్కువ సత్రాలు, ఎక్కువ భూములు ఉన్నది పల్నాడు జిల్లాలోనే. నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల వంటి చాలా పట్టణాల్లో అన్నదాన సత్రాల ఆస్తులు పరాధీనమయిపోతున్నాయి. బాపట్ల జిల్లాలోనూ రేపల్లె, చెరుకుపల్లి, కొల్లూరు, భట్టిప్రోలు, చందోలు, బాపట్ల వంటి చోటకూడా ఆస్థులకు రక్షణ లేని పరిస్థితి. అమరావతికి చెందిన సదావర్తి సత్రం భూములకు సంబంధించి గతంలో జరిగిన వివాదమే వీటికి ఉదాహరణ. ఈ సత్రం 1885లో నిర్మితమయితే, దీనికి సంబంధించి చెన్నై దగ్గర ఉన్న 471 ఎకరాల భూమి దీనికింద ఆస్తిగా దాత వాసిరెడ్డి వంశస్తురాలు వెంకటలక్ష్మమ్మ 1907లోనే రాసిచ్చిన విషయం తెలిసిందే. అయితే దేవాదాయ శాఖ దీనిని పట్టించుకోకపోవటంతో మొత్తం భూములు అన్యాక్రాంతమై, చివరకు 83 ఎకరాలు మాత్రమే మిగిలాయి. దీనిని మన ప్రభుత్వం అమ్మటానికి కూడా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు. ఇదే తరహాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీగా ఆస్థులున్న సత్రాల ఆస్తుల పరిరక్షణ గాలిలో దీపంలా వదిలేశారు. దీంతో దాతల ఆశయం పక్కదారి పడుతోంది. కొందరి చేతుల్లోకే మొత్తం ఆస్తులు చేరిపోతున్నాయి.



ఘంటా హనుమ్మ చారిటీస్ ధర్మ సత్రం భవనం

ఒక్క తెనాలినే ఉదాహరణగా తీసుకుంటే...

తెనాలి పట్టణం, చుట్టుపక్కల గ్రామాల్లో అయితే భర్తిపూడి రామయ్య పంతులు అన్నపూర్ణ ధర్మసత్రం, ఘంటా హనుమయ్య చారిటీస్, చుండూరువారి ధర్మసత్రం, యడ్లపల్లి కోటిలింగం ధర్మ సత్రం, ఓంకారాశ్రమం, కుసుమ మరనాద నిత్య అన్నదాన శాంతి ఆశ్రమం, కాకుమాను రామస్వామి శాంతి భవనం. కాకుమాను వెంకటసుబ్బన్న ధర్మసత్రం, శ్రీ రఘోత్తమరామశాస్త్రిగారి ధర్మ సత్రం, పోలేపెద్ది ఆదెమ్మ వేదపాఠశాల, కాకుమాను శంకరుని ధర్మసత్రం వంటి పదుల సంఖ్యలోనే సత్రాలున్నాయి. వీటిలో చాలావరకు తెనాలి పట్టణ నడిబొడ్డున ఉన్నవి అయితే, మరికొన్ని మంచి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనూ ఉన్నాయి. తెనాలి బోస్ రోడ్, బుర్రిపాలెం రోడ్, రైల్వే స్టేషన్ ఎదుట అత్యంత ఖరీదయిన ప్రాంతాల్లో ఉండటంతో వీటిపై ట్రస్టీల కుటుంబీకులకు ఆశ పెరిగిపోయింది. దీంతో దాతృత్వం చూపాల్సిన స్థానంలో తమకు అనుకూలమైన వ్యాపార స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే వీటిని నిర్మించిన ప్రదేశాలు ఇప్పుడు అత్యంత విలువైన ప్రదేశాలయితే, ఇవికాక వీటిపేరిట ఉన్న పొలాలు, ఇతర దుకాణ సముదాయాల వంటి ఆస్థులు కూడా ట్రస్టీల పెత్తనంలో పూర్తిగా మారిపోతున్నాయి. పెద్ద సత్రాలకు దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారులను పర్యవేక్షణకు నియమించినా అక్కడ జరిగే కార్యక్రమాలు ఏమీ లేకపోవటంతో వారు వీటిని పట్టించుకోకపోవటం, అసలు సంవత్సరానికొకసారికూడా వాటివైపు కన్నెత్తి చూడకపోవటంతో అన్యాక్రాంతమయిపోతున్న పరిస్థితి. వస్తున్న ఆదాయానికి ఒక లెక్కాలేదు... ఆస్తులకు రక్షణా లేదన్నట్టు తయారయింది.

అన్న'దానం' కాగితాల్లోనే...

ప్రతి సత్రంలోనూ అన్నదానం చేయటం, వసతి అవకాశం ఉన్నా భవనాల్లో గదులు అద్దెలకివ్వటం వంటివిచేసి, దేవాదాయ శాఖకు ఆదాయాన్ని జమచెయ్యాలి. కానీ ఇక్కడ అన్నీ కాగితాల్లోనే ఉంటుంటే, ఆదాయం మాత్రం ట్రస్టీల చేతుల్లోకి వెళ్లిపోతోంది. ప్రతి అన్నదాన సత్రంలోనూ ఐదు నుంచి 25 మంది వరకు రోజూ అన్నదానం చేయటం, ఆయా దాతల జయంతి, వర్థంతి సందర్భాల్లో పేదలకు ప్రత్యేక పంపిణీలు చేయటం పరిపాటి. భర్తిపూడి రామయ్య పంతులు అన్నపూర్ణ ధర్మసత్రం కింద 13.9 ఎకరాల భూమి, 7 సెంట్లలో సత్రం ఉంది. వీటిపై ఆదాయమే భారీగా వస్తుంది. సత్రం ఉన్న స్థలం బుర్రిపాలెం రోడ్డులో ఉంటే, దీనికి మంచి డిమాండే ఉంది. అయితే దీనిలో భవనం శిథిల స్థితికి చేరితే, ఆరుబయట ఉన్న ఖాళీ స్థలాన్ని బీరువాలు తయారుచేసే వారికి అద్దెకిచ్చారు. వీటి లెక్కలు దేవాదాయ శాఖకు చేరవు. ప్రతి ద్వాదశికి 29 మందికి అన్నదానం, చైత్ర బహుళ పాడ్యమి రోజున పేదలకు విశేష సంఖ్యలో అన్నదానం చెయ్యాలనేది దాతలు ఆలోచన. అయితే ఇక్కడ దశాబ్దకాలంగా అన్నదానమనే మాటే లేకుండాపోయింది. వచ్చిన ఆదాయం ఎటు పోతుందో! ఖాతాలో ఎంత జమవుతుందో ఆ దేవుడికే ఎరుక. సత్రంలో ఎంతమందికి అన్నదానం చెయ్యాలనేది గోడపై ట్రస్టీపేరుతో గతంలోనే రాసిఉంటే, దానిలో సంఖ్య, ఇతర వివరాలు చెరిపేసి ఉంచటం మరో ప్రత్యేకం.

రైల్వే స్టేషన్ ఎదుటే ఉన్న ఘంటా మనుమయ్య చారిటీస్‌కింద ధర్మ సత్రం, ఒక వసతి గృహం, పశువైద్యశాల నిర్వహిస్తున్నట్టు కాగితాల్లో ఉంది. అయితే ఇక్కడ భవనం పైన రేకులు వేసి ఒక కళ్యాణ మండపాన్ని నిర్మించారు. దీనిలో గదులు అద్దెకు కావాలని వెళితే ఖాళీ లేవని, చెప్పటం కొసమెరుపు. పేదలకు తక్కువ అద్దెకు వసతి ఇవ్వాల్సిఉన్నా, వాటిని కళ్యాణ మండపానికి సంబంధించిన డెకరేషన్, వంట పాత్రలకోసం, డైనింగ్ సామగ్రి నిల్వలకు, ఇతర అవసరాలకు గదులను వారే సొంతగా కేటాయించేసుకోవటం విశేషం. పోనీ దాతలిచ్చినదే కనుక శుభకార్యాలకయినా నామమాత్రపు రేటుకు అద్దెకిస్తున్నారా అంటే అదీ అంతంతమాత్రమే. మామూలు కళ్యాణ మండపాల్లాగానే అద్దెలు వసూలు చేయటం విశేషం. అయితే ఇక్కడ దాతల కోరిక మేరకు కొన్ని సందర్భాల్లో అన్నదానం చేయటం మాత్రం జరుగుతూ వస్తోంది.

కాకుమాను శంకరుని ధర్మసత్రం 1898లోనే నిర్మితమైంది. దీనికి 2.9 ఎకరాల భూమితోపాటు పట్టణ నడిబొడ్డయిన బోస్‌రోడ్డులో 20 దుకాణాలున్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో ప్రతి ద్వాదశికి పేద బ్రాహ్మణులకు అన్నదానం, దాత మరనించిన రోజున 2వేల మంది పేదలకు అన్నదానం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించాల్సి ఉంది. అయితే ఇక్కడ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉపకార వేతనాలు మాత్రం బాగానే ఇస్తున్నారు. నిత్యాన్నదానం లేకపోయినా, దాత వర్థంతిరోజున మాత్రం పేదలకు అన్నదానం జరుగుతూనే ఉంది. అయితే దీని కింద అత్యంత ఎక్కువ అద్దెలు వచ్చే దుకాణాలున్నాయి. ఇటీవలే సత్రంలోపల భవనాలు నిర్మించారు. అయితే వీటి లెక్కల విషయంలో మాత్రం పలు విమర్శలున్నాయి.

రఘోత్తమరాయ రామశాస్త్రి ధర్మసత్రాన్ని 1901లో నిర్మించారు. ప్రస్తుతం కార్యకలాపాలు అంతంతమాత్రమే. కాకుమాను రామస్వామి శాంతి భవనం కింద 9 దుకాణాలపై వచ్చే ఆదాయంతో నిత్యం 40మంది ప్రత్యేక అవసరాలున్న వారికి అన్నదానం చెయ్యాలనేది నిర్ణయం. కానీ నిత్యం జరుగుతున్న దాఖలాలు లేవు.

కాకుమాను వెంకటసుబ్బమ్మ ధర్మసత్రం రైల్వేస్టేషన్ సమీపంలోనే ఉంది. బాటసారులకు వసతి కల్పించటం, దీనికిందున్న షాపురూములపై వచ్చే అద్దెతో నిర్వహణ జరపాలి. కానీ అవీ నామమాత్రమే.

చుండూరు వారి ధర్మ సత్రం కూడా 1902లో స్థాపించారు. దీనికింద 20 ఎకరాల భూమి ఉంది. 6 షాపులు ఉన్నాయి. ప్రజలకు వసతి సౌకర్యం కల్పించటం, 6 గురికి అన్నదానం చేయటం చెయ్యాలి. అయితే ఇక్కడ అన్నదానం జరుగుతోంది. ఆస్థుల పరిరక్షణ ఎంతవరకు ఉందనేది ప్రశ్నార్థకమే. ఇదే తరహాలో మిగిలిన ప్రాంతాల్లోని ధర్మ సత్రాల ఆస్తులు అన్యాక్రాంతం అయిపోతున్నాయి. వీటికి సత్రం ఉన్న ప్రాంతంలో కాకుండా ఇతర జిల్లాల్లోనూ పొలాలు, ఇతర ఆస్తులున్నాయి. సత్రం ఉన్నచోటే ఆస్తులు పరాధీనమైపోతుంటే, ఇతర జిల్లాల్లో ఉన్న ఆస్థుల పరిస్థితి సరేసరి. కొన్నిచోట్ల భూముల ధరలకు రెక్కలు రావటంతో కొంత భూమిని ట్రస్టీలు సొంత స్థలాల కింద చేతులు మార్చారనేదికూడా వస్తున్న ఆరోపణ. అయితే వీటిపై దేవాదాయ శాఖ అధికారులను ప్రశ్నిస్తే మాత్రం అంతా గోప్యంగా ఉంచటం విశేషం. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే ట్రస్టీలను అడగాలని బదులివ్వటం కొసమెరుపు. ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారులే ట్రస్టీల చేతిలో బొమ్మలుగా మారిపోవటంతో దాతల ఆస్థులు దారిమళ్లి చేతులు మారిపోతున్నాయి. వీటి లెక్కలు ఆ దేవదేవుడే చూసుకోవాల్సిన పరిస్థితి.

ప్రణాళికతో పదింతల ఫలితం

● సాధన చేస్తే మంచి మార్కులు

● 10వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు



సత్తెనపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితానికి తొలి సోపానమైన 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా రోజు విడిచి రోజు పరీక్షలు ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. సంవత్సరం అంతా కష్టపడి చదివినా శ్రమవృథా కాకుండా ఉండాలంటే రాబోయే కాలాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థులు టైమ్ టేబుల్ రూపొందించుకొని చదివితే మంచి మార్కులు సాధించ వచ్చని, చదువుతో పాటు తగిన నిద్ర, విశ్రాంతి అవసరమని చెబుతున్నారు. 10వ తరగతి విద్యార్థుల కోసం ఆయా సబ్జెకుల ఉపాధ్యాయుల సూచనలు ఇలా ఉన్నాయి.

చిత్రాలపై సాధన చేయాలి



భౌతిక శాస్త్రం 50 మార్కులకు ఉంటుంది. 17 ప్రశ్నలకు జవాబులు రాసేందుకు సమయం రెండు గంటలు. ఒక మార్కు ప్రశ్నలు ఎనిమిది ఉంటాయి. రెండు మార్కుల ప్రశ్నలు మూడు, నాలుగు మార్కులు మూడు ఉంటాయి. 12వ ప్రశ్నకు డయాగ్రమ్‌కు చాయిస్ ఉంటుంది. ఎనిమిది మార్కుల ప్రశ్నకు అంతర్గత చాయిస్ ఉంటుంది. ఆమ్లాలు, క్షారాల యందు ఛాయిస్‌తో కలిపి తొమ్మిది మార్కులకు ఉంటుంది. విద్యుత్, మానవుని కన్ను, అందమైన ప్రపంచం యూనిట్‌లో ఎనిమిది మార్కులకు ఛా యిస్ ఉంటుంది. రసాయన చర్యలు, సమీకరణాల, సమ్మేళ్లనాల్లో ఎనిమిది మా ర్కులకు ఛాయిస్ ఉంటుంది. విద్యుత్ ఐస్కాంత యూనిట్, లోహాలు, లోహాలకు సంబంధించి ఎనిమిది మార్కులకు ఛాయిస్ ఉంటుంది.

\-సొప్పర కమలాకరరావు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్ వెన్నాదేవి

ఆంగ్లపై ఆందోళన వద్దు



ఆంగ్ల మంటే అందరూ ఆందో ళన పడుతుంటారు. అర్థం చేసుకుంటూ చదివితే చాలా సులభం. ఆంగ్ల పరీక్ష పేపరు మూడు భాగాలుగా ఉంటుం ది. సెక్షన్ ఏలో రీడింగ్, కాంప్రెహెన్షన్ 30 మార్కుల్లో 24 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఆరు మార్కు లకు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. ఒకటి నుంచి 15, 16, 17 ప్రశ్నలపై దృష్టి సారిస్తే మార్కులు సులువుగా వస్తాయి. సెక్షన్ - బీలో వకాబులరీ గ్రామర్ 40 మార్కులకు ఉంటుంది. మొత్తం పా ఠ్యాంశాలు బాగా చదివితే 18 నుంచి 34వ ప్రశ్న వరకు సమాధానాలు రాసి మార్కులు సాధించవచ్చు. సెక్షన్ - సీలో 30 మార్కుల్లో 35వ ప్రశ్న డైరీ రైటింగ్, 36 ప్రశ్న లెటర్ రైటింగ్, 37వ ప్రశ్న పేరగ్రాఫ్ రైటింగ్ ఉంటాయి. క్రియేటీవ్, లెటర్ రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ ప్రశ్నలపై సాధన చేయాలి.

\-బిల్లా పద్మ, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు), జెడ్పీహెచ్ఎస్ గరల్స్, సత్తెనపల్లి

సులభంగా తెలుగులో మార్కులు



తెలుగులో మంచి మార్కులు సాధించుకోవటం విద్యార్థుల చేతుల్లోనే ఉంటుంది. చక్కటి రాత, అక్షర దోషాలు, కొట్టి వేతలు లేకుండా జాగ్రత్త పడాలి. అవగాహన ప్రతి స్పందనకు 32 మార్కులు, వ్యక్తీకరణ సృజనాత్మకతకు 36 మార్కులు, భాషాంశాలకు 32 మార్కులు ఉంటాయి. పద్యంశాల నుంచి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. వాటిని చదివి ఒక వాక్యంలో సమాధానం రాస్తే నాలుగు ప్రశ్నలకు ఎనిమిది మార్కులు వస్తాయి.

\- మోదుకూరి భరత మాణిక్య జోత్స్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ఆర్‌కే పురం

రెక్కల కష్టమే...

ఆమెకు ఆక్సిజన్



ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేది ఆక్సిజన్. ఆ సిలిండర్లు మోయగా వచ్చే డబ్బు సంపాదనే ఆమె కుటుంబానికి ఆక్సిజన్ వంటిది.పెదకాకాని బైపాస్ వద్ద ఒక మహిళ కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్న దృశ్యం ఇది.

\-గుంటూరు, ఆంధ్రజ్యోతి

ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

● ఎలక్షన్ అబ్జర్వర్ కరుణ

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలను నిస్పక్షపాతంగా నిర్వహించాలని ఎలక్షన్ అబ్జర్వర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీ కరుణ ఆదేశించారు. సోమవారం ఆమె తొలిసారిగా ఎన్నికల పరిశీలనకు కలెక్టరేట్‌కు వచ్చారు. నామినేషన్ల ప్రక్రియని పరిశీలించి రిటర్నింగ్ అధికారి ఎస్ నాగలక్ష్మితో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్ కోడ్‌ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నామినేషన్ల పరిశీలన సజావుగా పూర్తి చేయాలని, ఆ తర్వాత బ్యాలెట్ పేపర్ ముద్రణ, బాక్సులను సంసిద్ధం చేయడం వంటివన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు.

ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రచారం చేసుకునేందుకు అనుమతులు తీసుకోవాలని ఆర్‌వో నాగలక్ష్మి స్పష్టం చేశారు. అభ్యర్థులకు అవసరమైన దరఖాస్తులను కలెక్టరేట్ నుంచి పొందవ చ్చన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన ఎన్నికల పరిశీలకురాలు వీ కరుణకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఆర్‌వో నాగలక్ష్మి

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రః 99854 11226, 99854 11220
99852 07026

21 వరకు సాయి సాధన చిట్ ఫండ్ నిర్వాహకుడికి రిమాండ్

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి), ఖాతాదారులను, డిపాజిట్‌దారులను మోసగించిన కేసులో నిందితుడైన పట్టణంలోని సాయి సాధన చిట్ ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావుకు ఈ నెల 21వరకు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇంచార్జ్ న్యాయ అధికారి ఆశీర్వాదం పాల్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరులో నమోదైన ఓ కేసుకు సంబంధించి గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న పుల్లారావును మొదటి పట్టణ పోలీసులు పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ వేలూరు సుబ్బారెడ్డి ఫిర్యాదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న పుల్లారావును పీటీ వారెంట్‌పై న్యాయ అధికారి ఎదుట హాజరుపరిచారు. న్యాయ అధికారి ఈ నెల 21 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కాగా పుల్లారావును 20రోజులపాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

విడదల రజిని, కుటుంబ సభ్యులపై ఎస్పీకి ఫిర్యాదు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 2022లో తన ఇంటిపైన దాడి, హత్యాయత్నం జరిగిన సంఘటనలో మాజీమంత్రి విడదల రజని, ఆమె మరుదల పాత్ర ఉన్నదని పట్టణానికి చెందిన నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎస్పీ కంచి శ్రీనివాసరావును కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రావు సుబ్రహ్మణ్యం ఎస్పీకి విన్నవించారు. అధికారం అడ్డుపెట్టుకొని రజిని చిలకలూరిపేట నియోజకవర్గంలో గూండారాజ్యం నడిపారని ఆయన పేర్కొన్నారు.

ఎస్ఎస్ఎన్ కళాశాలలో జాబ్ మేళా

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో డ్రోన్ పైలెట్ జాబ్ మేళా సోమవారం నిర్వహించారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ డ్రోన్ పైలెట్ జాబ్స్‌కోసం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ఏడాదికి రూ.3లక్షల వేతనం, ఇతర వసతులు కల్పిస్తామన్నారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు 119మంది హాజరు కాగా 30మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ సాయి, ఎకనామిక్స్ డిపార్టుమెంట్ ఎస్.శ్రీహరి, కంప్యూటర్ డిపార్టుమెంట్ సదాశివ సత్యనారాయణ, ఎన్వీ రమణరావు, కంప్యూటర్ లాబ్ ఇన్‌చార్జి ఎస్.శైలజ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 10: (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై, పాండిచ్చేరికి చెందిన ప్రముఖ కంపెనీ లుమినా డేటామాటిక్స్ ప్రతినిధులు కళాశాల ఆవరణలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా కళాశాలకు చెందిన 12మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనంగా రూ.3.5లక్షలు అందుకోనున్నారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు అభినందించారు.

ఘనంగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రథమ మహాసభ

వినుకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ప్రథమ మహాసభ రైల్వేస్టేషన్ రోడ్డులోని పంచాయతీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం జరిగింది. మహాసభకు తోట ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఐ ఎంఎల్ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎస్.శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, రాష్ట్ర నాయకులు రాందేవ్, ఉదయ్, కిరణ్ హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు.

ఎరువుల షాపులలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీలలో భాగంగా రాత్రి 8 గంటల సమయంలో వ్యవసాయ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదినారాయణ, శివాజీ, చంద్రశేఖర్‌లు తనిఖీలలో పాల్గొన్నారు.

ఈశ్వర్ కళాశాలలో సైబర్ నేరాలపై సదస్సు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని జాతీయ భద్రతా డేటాబేస్ సంస్థ చీఫ్ కౌన్సిలర్ కే ప్రదీప్ కుమార్ అన్నారు. సోమవారం ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కే ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసేటప్పుడు వచ్చే పర్మిషన్‌లు, మెసేజ్‌లు, ఓటీపీలు వంటివి అవసరం ఉంటేనే వాడుకోవాలన్నారు. అనధికార వెబ్‌సైట్‌లును వినియోగించకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇలాంటివి ఆపడానికి, ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎన్ఎస్ఎస్ పీవోహెచ్ గంగాధరరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు కొండగురునాథ స్వామి తిరునాళ్ళ

నూజెండ్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవ్వవరం కొండగురునాథ స్వామి తిరునాళ్ళ బుధవారం వైభవంగా జరగనున్నది. మాఘ పౌర్ణమి సందర్భంగా కురిమికొండపై తిరునాళ్ళకు ఏర్పాట్లుచేస్తున్నారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకం
- నరసరావుపేట ప్రాజెక్టు పరిధిలో నాలుగు కేంద్రాల ఎంపిక
- మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు


పెరటి తోటలను పరిశీలిస్తున్న నరసరావుపేట సీడీపీవో సీహెచ్ ఉమామహేశ్వరి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) గడిచిన ఐదేళ్ళలో అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధికి నోచుకోలేదు. పసిపిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే చిక్కీలు, పాల ప్యాకెట్‌లపై జగన్ బొమ్మలు వేసి ప్రచారం చేసుకోవడం మినహాయిస్తే అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి గాని, పసిపిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు నాణ్యమైన పోషకాహారంతో పాటుగా తాజా కూరగాయలతో ఆహార పదార్థాలు అందిస్తూ వారి ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలను పచ్చదనంతో నింపుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించడమే కాకుండా ఆరోగ్యం ఆనందకరమైన బాల్యాన్ని చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సాక్ష్యం అనే కార్యక్రమం అమలు చేస్తోంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. పలుచోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వివిధ కేంద్రాల్లో పోషణతో పాటు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, చిన్నారులకు ఆటవస్తువులు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయనున్నారు. దీంతో చిన్నారులు బడివైపు ఆకర్షితులవుతున్నారు. నరసరావుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 236 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో రొంపిచర్ల మండలంలోని విప్పర్లపల్లి, సుబ్బయ్యపాలెం, తురిమెళ్ళ, గోగులపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణవాటిక కార్యక్రమం ద్వారా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరల తోటలను పెంచుతున్నారు. పోషణ వాటిక కింద ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేల రూపాయలను ప్రభుత్వం కేటాయిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రం వద్ద స్థలం అందుబాటులో ఉంటే సేంద్రీయ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పండించి వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నారు. స్థలం లేని కేంద్రాలకు స్థలం ఉండే కేంద్రాల వద్ద పండించిన ఆకుకూరలు, కూరగాయలను సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.


అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సొంత భవనాల్లో సౌకర్యాల పెంపుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు మంజూరవుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 1, 2 ఆర్ఐడీఎఫ్ మనబడి - మన భవిష్యత్తు అనే కార్యక్రమాల ద్వారా మంజూరైన నిధులతో అంగన్‌వాడీ భవనాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రీ ప్రైమరీ విద్యను మరింత సమర్థవంతంగా అందించాలని ప్రత్యేక దృష్టి సారించి సాంకేతికంగా మేళవించి ప్రతిష్టాత్మక ప్రణాళికలతో లక్ష్యాలను చేరుకునే చర్యలను చేపట్టి సమాచారాన్ని బాల సంజీవని యాప్ ద్వారా నిక్షిప్తం చేసి మొత్తం సమాచారం పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

అహ్లాదకరమైన వాతావరణం తీసుకువస్తున్నాం: సీడీపీవో ఉమామహేశ్వరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సాక్ష్యం కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణవాటిక ఏర్పాటుచేసి ఒక అహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకువస్తున్నాం. అంతేకాకుండా తాజా కూరగాయలు, ఆకుకూరలతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం. బాల సంజీవిని కిట్‌లను తల్లులకు ఇవ్వడమే కాకుండా హైరిస్కు తల్లులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

అగ్నిమాపక కేంద్రం కోసం హోంమంత్రికి వినతి


హోంమంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హోంమంత్రి వంగలపూడి అనితకు వినతిపత్రం అందజేశారు. సోమవారం శ్రీశైలం వెళ్తూ మార్గమధ్యలో వినుకొండలో ఆమె ఆగారు. జీవీ ఆహ్వానం మేరకు కొత్తపేటలోని ఆయన నివాసానికి హోంమంత్రి వచ్చారు. ఈ సందర్భంగా జీవీ హోంమంత్రిని సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలం కూడా సిద్ధంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు హోంమంత్రిని ఆహ్వానించారు. సమస్యల గురించి చర్చించారు. హోంశాఖ తరుపున త్వరితగతిన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు అనుమతులు ఇప్పించాలని కోరారు.

లెదర్ పార్కు స్థల పరిశీలన


లెదర్ పార్కు నిర్మించనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న జీవీ, మక్కెన తదితరులు

వినుకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మల్టీ నేషనల్ కంపెనీలతో వినుకొండకు లెదర్ పార్క్ రాబోతుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు పట్టణానికి సమీపంలోని వెంకుపాలెం వద్ద సర్వేనంబరు 1లో 98.20 ఎకరాల ప్రభుత్వ భూమిని సోమవారం జీవీ ఆంజనేయులు పరిశీలించారు. రీబోక్, పుమా, నైక్ వంటి పలు లెదర్ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సాయి సాధన చిట్ ఫండ్ ఎదుట బాధితుల ఆందోళన


సాయిసాధన చిట్ ఫండ్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పల్నాడు రోడ్డులోని సాయి సాధన చిట్ ఫండ్ కార్యాలయం వద్ద బాధితులు సోమవారం ఆందోళన నిర్వహించారు. సాయిసాధన చిట్ ఫండ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మీరాబీ అనే మహిళ మాట్లాడుతూ బంగారం తాకట్టు పెట్టి రూ.5లక్షలు తెచ్చి డిపాజిట్ చేశామన్నారు. తన సోదరుడు రూ.70 లక్షలు ఇచ్చారని తెలిపింది. మరో బాధితుడు సాతులూరుకు చెందిన ఐనవోలు రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ చిట్‌ను ఎవరు పాడుకున్నా ముగ్గురు ష్యూరిటీలు తీసుకుంటరన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనూ నష్టాలు లేవన్నారు. అయితే ఏం జరిగిందనేది నిగ్గుతేల్చాల్సి ఉందన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలన్నారు. యామని రామారావు మాట్లాడుతూ గత ఆరునెలల నుంచి చిట్ పాడుకున్నా డబ్బులు ఇవ్వకుండా అక్కడే డిపాజిట్ చేసుకుంటున్నారని చెప్పారు. ప్రతి వాళ్ళు ఒకరికి తెలియకుండా ఒకరు డిపాజిట్‌లు చేశారని, ఆ డబ్బు ఏమి చేశాడనేది తెలియడం లేదన్నారు. ఈ విధంగా 60 నుంచి 70 కోట్ల వరకు సేకరించారని సమాచారం ఉందన్నారు. అల్లుడు, కూతురును విదేశాలకు పంపి, ఇటీవల మాల్‌దీవ్స్, మలేసియా వెళ్ళి వచ్చారన్నారు. అమెరికాకు వీసా పెట్టుకుంటే తిరస్కరించారని అన్నారు. పుల్లారావుకు చిట్‌ఫండ్‌లో, రియల్ ఎస్టేట్‌లో నష్టం వచ్చిన దాఖలాలు లేవన్నారు. అరెస్టు అయిన రోజు చిట్‌ఫండ్‌కు ఇవ్వాల్సిన దానికన్నా ఆస్తులు ఎక్కువ ఉన్నాయని చెప్పాడన్నారు. ఇప్పటికైనా మనసు మార్చుకొని అందరికీ సమన్యాయం చేయాలన్నారు. విదేశాలకు వెళ్ళకుండా లుక్ అవుట్ నోటీసు ఇచ్చామన్నారు. బాధితులకు న్యాయం చేసి అందరిని కాపాడాలన్నారు. చిట్ ఫండ్ కార్యాలయం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

శావల్యాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 46 ప్రభుత్వ పాఠశాలలు, 46 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 5234మంది పిల్లలకు గాను 4996మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్ తెలిపారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొని పిల్లలతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఎంఈవోలు మద్దిగుంట్ల సాంబశివరావు, పుసులూరి లలితాకుమారి, వైద్యాధికారి రాధాకృష్ణన్, హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులతో నులి పురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఎంపీడీవో మాట్లాడుతూ తొలిరోజునే 95.46శాతం నులిపురుగుల మాత్రల పంపిణీని పూర్తిచేసిన వైద్యసిబ్బందిని అభినందించారు. మిగిలిన పిల్లలను కూడా గుర్తించి నూరుశాతం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ ఏడుకొండలు, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

● యడ్లపాడు: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండలంలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,598మంది విద్యార్థులు ఉండగా తొలిరోజు 8,132 మంది 95శాతం మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. యడ్లపాడు ఎర్రచెరువులోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన మాత్రల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి పాల్గొని చిన్నారులకు మాత్రలు వేశారు. అనంతరం ప్రక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. తల్లులకు పిల్లల ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ మాట్లాడుతూ మండలంలో 8,598 మంది పిల్లలు ఉండగా 8,132మందికి మాత్రల పంపిణీ చేశామని, మిగిలిన వారికి ఈ నెల 17న పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేశారు. ఆయా కార్యక్రమాలలో సీహెచ్‌వో పున్నారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, నాయుడుపాలెం, సంగినీడుపాలెం తదితర గ్రామాల్లోని బాల బాలికలకు జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఆల్ బెండా జోల్ మాత్రలను పంపిణీ చేయటం జరిగింది. ఈ సందరక్భంగా వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వీ కృష్ణా నాయక్ మాట్లాడుతూ 4,859 మంది పిల్లలకు గాను 4,095 మందికి వేసి 94 శాతం పంపిణీ చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కే సాయి తేజ, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

● ఈపూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంను పురస్కరించుకొని మండలంలో సోమవారం ఆల్బెండ్‌జోల్ మాత్రలను కొచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగేంద్రబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కొచ్చెర్ల, కొండ్రముట్ల, ఉప్పరపాలెం గ్రామాలలోని పాఠశాలల్లో పంపిణీ చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వాలు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు దోహద పడుతున్నాయని వైద్యాధికారులు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు, వైద్య సిబ్బంది ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో కే-రిడ్జి విద్యార్థుల ప్రతిభ


విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జీ బర్నబాస్ తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ విద్యార్థులు ఫ్లోర్‌బాల్ పోటీలలో ప్రతిభ చాటారని పీడీ ఎం.కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. మార్టూరు మార్కెట్ యార్డ్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్‌బాల్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్-17 ఫ్లోర్ బాల్ స్టేట్ లెవెల్ చాంపియన్ షిప్‌లో బాలికల విభాగంలో తృతీయస్థానం సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ జీ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, అకడమిక్ కో-ఆర్డినేటర్ షుట్ట హేమంత్, పీడీలు భాను ప్రకాష్, మహిత విద్యార్థులను అభినందించారు.

పోట్లూరు సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి

● ఎంపీడీవోకి గ్రామస్థుల ఫిర్యాదు

శావల్యాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలపై నిర్లక్ష్యం వహిస్తున్న పోట్లూరు గ్రామసర్పంచ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని పోట్లూరు గ్రామస్థులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను సోమవారం కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, నాలుగు నెలలుగా వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రివేళల్లో మహిళలు, విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని, రెండేళ్ళుగా డ్రెయినేజీల్లో పూడికతీత పనులు, గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామసర్పంచ్ పోపూరి జ్యోతి, ఆమె భర్త చిన్నబ్బాయి ప్రజలతో దురుసుగా మాట్లాడుతూ వైసీపీ ముసుగులో గ్రామాభివృద్ధికి అడ్డుపడుతున్నారన్నారు. మూడేళ్ళుగా పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, వేలంలో రూ.18లక్షలు విలువైన చేపల చెరువును రూ.7లక్షలకే దక్కించుకొని పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వారిపై తక్షణం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్థులు గోనుగుంట్ల ధనుంజయ్, గడిపూడి ఆంజనేయులు, పొందూరి రామయ్య, గోనుగుంట్ల వెంకట్రావు, గాలి మారుతి, పొందూరి సుబ్బయ్య, గడిపూడి పేరయ్య, పొందూరి శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూచినపల్లిలో మిర్చి చోరీ

ఈపూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పొలంలో ఆరబెట్టిన మిరపకాయలను చోరీ చేసిన సంఘటన మండలంలోని కూచినపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బద్దుల చిరంజీవి మూడు ఎకరాలలో మిర్చి సాగుచేశాడు. మిరపకాయలను పొలంలోనే ఆరబెట్టాడు. గ్రామానికి దగ్గరలోని కాలువ పక్క పొలంలో కల్లంచేసి మిరపకాయలను ఉంచాడు. ఆదివారం రాత్రి 10గంటల వరకు కాపలా ఉండి వచ్చాడు. తెల్లవారి పొలం వెళ్ళేసరికి ఆరబెట్టిన మిరప కాయలలో సగం చోరీకి గురైనట్లు రైతు చిరంజీవి గుర్తించాడు. సుమారు 10క్వింటాల వరకు చోరీ జరిగినట్లు పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సోమవారం సందర్శించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సుప్రీం కోర్టు తీర్పులతో దళితుల చట్టాలు నిర్వీర్యం: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు

శావల్యాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పులతో రాజ్యాంగంలో దళితులు, గిరిజనుల కోసం రాసిన చట్టాలన్నీ నిర్వీర్యంగా మారుతున్నాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ విమర్శించారు. శావల్యాపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు 2004లో ఎస్సీ వర్గీకరణను చేయాలంటే పార్లమెంట్‌లో అత్యధిక మెజారిటీని ఉండాలని తీర్పునిచ్చిందని, అదే న్యాయస్థానం ఇప్పుడు దానికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ చేయవచ్చని తీర్పు చెప్పడం వెనుక కేంద్ర పెద్దల హస్తమున్నట్లుగా ప్రజలు అర్థం చేసుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులంతా ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలన్నారు. జగనన్న కాలనీల్లో గతంలో పేదలకు ఇచ్చిన స్థలాలలో ఇప్పటివరకు కట్టుబడులు లేనివాటిని ప్రభుత్వం రద్దుచేసి కొత్తగా ఏర్పాటుచేస్తున్న ఎన్టీఆర్ కాలనీల్లో వారికి 3సెంట్లు భూమినిచ్చి వారికి గృహ నిర్మాణాలు చేయించాలని కోరారు. ఎస్సీ శ్మశాన వాటికలు లేని గ్రామాల్లో ప్రభుత్వం శ్మశాన వాటికలకు స్థలాన్ని కేటాయించాలని, రాష్ట్రంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కోండ్రు విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిపూడి ఏసురత్నం, వినుకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బొందలపాటి నాగేశ్వరరావు, నాయకులు రాయిని చిన్న, బొందలపాటి పెదరంగయ్య పాల్గొన్నారు.

ఎన్ఈసీలో జుబ్లియేషన్ 2కే25 వేడుకలు

నరసరావుపేట రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జుబ్లియేషన్ టూ కే టూ ఫైవ్ సాంకేతిక, సాంస్కృతిక, క్రీడ, ఎన్‌సీసీ పోటీలు నిర్వహించినట్లు కళాశాల వైస్ చైర్మన్ ఎం.చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి సాంకేతిక పురోగతి వెన్నుముక వంటిది అన్నారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న అన్నిరకాల సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇస్రో ప్రతినిధి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తుపై ముందు చూపుతో ఉండాలన్నారు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రకాలుగా ముందంజలో ఉండాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ప్రసంగించారు. వివిధ కళాశాల నుంచి 766మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు కళాశాల యాజమాన్యం కార్యక్రమ నిర్వాహకులైన సురేష్‌బాబు, రాజు ఇతర వివిధ విభాగాల అధిపతులను వలంటీర్లను అభినందించారు.

రూపాయి నాణాన్ని మింగిన బాలుడు

● ఎండోస్కోపీ విధానంతో తొలగించిన వైద్యులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అన్నవాహికలో ఇరుక్కుపోయిన నాణాన్ని ఎండోస్కోపీ విధానంలో తొలగించిన సంఘటన సోమవారం ఇక్కడ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ మూడేళ్ల బాలుడు ఆడుకుంటూ ఆదివారం రాత్రి రూపాయి నాణెం మింగాడు. అదే పొట్టలోకి పోతుందిలే అని నిర్లక్ష్యం చేశారు. బాలునికి నొప్పి ఎక్కువగా వుండటంతో స్థానిక ముప్పాళ్ళ హనుమంతరావుకు చెందిన జానకీ నర్సింగ్ హోమ్ ఆసుపత్రికి సోమవారం మధ్యాహ్నం తీసుకువచ్చారు. గ్యాస్ట్రిక్ వైద్యనిపుణుడు డాక్టర్ ముప్పాళ్ళ బలరామ కృష్ణతేజస్వి నాణం బాలుడి అన్నవాహికలో ఇరుక్కుపోయినట్టు గుర్తించారు. అనంతరం ఈ నాణాన్ని ఎండోస్కోపీ విధానంలో తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజస్వీ మాట్లాడుతూ పిల్లలు ఇటువంటివి మింగిన 6గంటలలోపు వైద్యులను సంప్రదించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

ఆలపాటి గెలుపునకు కృషి చేయాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో 90 శాతానికి పైగా ఓట్లు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పోలయ్యేలా కృషి చేయాలని, ఇందుకు ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి అభ్యర్థించాలని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన బూత్, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్‌లు, సాధికార మిత్రల నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 30ఓట్లకు ఒకరు చొప్పున నియమితులైన సాధికారమిత్రలు ప్రతి పట్టభద్రుడిని కలిసి కూటమి ప్రభుత్వ విధానాలు, పనితీరు తెలియచేయాలన్నారు. మొదటి ప్రాధాన్య ఓటు ఆలపాటికి పడేలా ఓటర్లకు బ్యాలెట్ నమూనా ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జనసేన ఇంచార్జి తోట రాజా రమేష్, పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, కూటమి పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: కూటమి మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న ఆలపాటి అనుభవం యువతకు ఎంతో ఉపయోగపడుతుందని ఏపీ ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. పట్ట భద్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు మద్దతుగా సోమవారం ఆయన సాతులూరు, నాదెండ్ల గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయనతో పాటు టీడీపీ సమన్వయకర్త ఎస్.సదాశివరావు, పార్టీ నాయకులు బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు హరిబాబు, గుర్రం నాగ పూర్ణచంద్రరావు, వేములపల్లి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో అనర్హులను గుర్తించండి

● శావల్యాపురం తహసీల్దార్ సుజాత

శావల్యాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీల్లో అర్హత లేకుండా నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులను గుర్తించాలని మండల తహసీల్దార్ సుజాత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల జాబితాలను వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పరిశీలించి అనర్హులైన వారిని గుర్తించి నివేదికలు అందజేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్-30 ప్రకారం గ్రామాల్లో ప్రభుత్వానికి చెందిన పోరంబోకు భూముల్లో ఇళ్ళు నిర్మించుకొని నివాసముంటున్నవారిని గుర్తించి, ఆయా భూములపై ఫిర్యాదులు లేనట్లయితే నివాసం ఉంటున్నవారికి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తలూరులో జరుగుతున్న రీసర్వేలో గౌండ్ రూటింగ్ ప్రారంభం కావడంతో అన్నిగ్రామాల వీఆర్వోలను టీంలుగా విభజించామని, ప్రతి టీం సభ్యులు రీ సర్వేని త్వరితగతిన పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. రీసర్వే డీటీ నాసరయ్య, సర్వేయర్ రాజు, సీనియర్ అసిస్టెంట్ చంద్రబాబు పాల్గొన్నారు.

పది విద్యార్థుకు స్టడీ మెటీరియల్ పంపిణీ

యడ్లపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్‌లో ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. సాయంత్రం స్టడీ అవర్‌లో విద్యార్థులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట 13 వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో ఓ.ఎస్. నెం.2/2021

జతీన్
ముద్దాల చైతన్యకుమార్ వగైరాలు -- వాదులు
వర్సెస్
ముద్దాల రామారావు వగైరాలు -- ప్రతివాదులు
టు
డి8- రెడ్డి రూప, తండ్రి జె.వి.గుప్త డోర్ నెం.3-239, 7వ లైను, పండరీపురం, చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.
పై నెంబరు దావాలోని పై కోర్టు వారినుండి ఇప్పటికే మీకు అనేక పర్యాయములు దావా సమన్లు జారీ చేయించగా మీరు సమన్లు తీసుకోని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నమిత్తం ది. 18-02-2025 వ తేదీకి వాయిదా అయి వున్నది. కావున వాయిదా రోజు ఉదయం 10.30 ని.లకు మీరు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా కాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమునందు తీర్మానించబడును.
బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు
వాయిదా తేదీ : 18-02-2025
ఇట్లు
శ్రీ జి. ఆలోకిమార్
వాదుల తరపు న్యాయవాది, నరసరావుపేట.